Licensed to post without Prepayment No. J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03

నెల్లూరు, 23.11.2018, శుక్రవారం సంపుటి : 38 సంచిక : 25 పేజీలు : 12, వెల : ₹ 5


కేర్
డా॥ ఆలూరు స్వరూప్ కుమార్ రెడ్డి M.D.S.
Professor - Department of Conservative Dentistry
Specialist - Cosmetic, Lasers & Implant Dentistry
సూపర్ స్పెషాలిటి దంత వైద్యశాల
పొగతోట, నెల్లూరు ✆ 9247004747
ఉచిత (క్యాష్‌లెస్) దంత వైద్యసేవలు
• రాష్ట్ర పోలీస్ ఉద్యోగులకు, కుటుంబ సభ్యులకు ఆరోగ్య భద్రత
• రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు EHS (ఎంప్లాయిస్ హెల్త్ స్కీము)

# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com

## సెంట్రల్‌కు... ఛాలెంజ్

> మోడీ సహనానికి బాబు పరీక్ష

> కొత్త కూటమితో కమలాన్ని రెచ్చగొడుతున్నాడు

> సిబిఐకి 'నో బోర్డ్' పెట్టి లోపాలను బయటపెట్టుకున్నాడు

*నీతికి నిలిచినవాడు ఏటికి కాదు, సముద్రానికైనా ఎదురీదుతాడు. నీతి తప్పిన వాడు నీడను చూసి కూడా భయపడుతుంటాడు. నీతికి నిలబడడం ఒక హుందాతనాన్ని తెచ్చిపెడితే... నీతి తప్పడం మనిషిని అన్ని కోణాల లోనూ పతనం చేస్తుంది.*

2004లో మాజీమంత్రి పరిటాల రవి హత్యకేసులో తన కొడుకు వై.యస్. జగన్మోహన్‌రెడ్డిపై ప్రతిపక్ష నేతలు నిందలు వేయగానే నిండు శాసనసభలో సిబిఐ విచారణ కోరుతూ పరిటాల రవి హత్య కేసులో తన కొడుకు జగన్ పాత్ర వుందని తేలితే ఉరిశిక్ష వేయండని ప్రకటించిన దమ్మున్న నాయకుడు దివంగత నేత డాక్టర్ వై.యస్.రాజశేఖరరెడ్డి. ఆయన పరిపాలనా వ్యవహారాలలో డొంక తిరుగుళ్లు వుండేవి కాదు. సుత్తి వుండేది కాదు. ఏదైనా సూటిగా పోరాడడమే!

మరి నేడు చంద్రబాబు ప్రభుత్వం చేసిందేమిటి? ఏపిలోకి కేంద్ర ప్రభుత్వ విచారణ సంస్థ సిబిఐను ప్రవేశించకుండా జి.ఓ జారీ చేశారు. సిబిఐ విచారణ వద్దనడం వెనుక కారణం ఏమిటి? అసలు సిబిఐను అడ్డుకోవాల్సిన అవసరం చంద్రబాబుకు ఏమొచ్చింది. సిబిఐ అన్నది భారత దేశ అత్యున్నత దర్యాప్తు సంస్థ. దేశంలో జరిగే పెద్దపెద్ద స్కాంలను, ఇతర అక్రమాలను విచారించే సంస్థ. ఈ సంస్థ పట్ల చంద్రబాబు భయపడాల్సిన పనేముంది. జగన్ అక్రమాస్తుల కేసును దర్యాప్తు చేసి ఆయనను జైలుకు పంపేటప్పుడు ఎంతో మంచిదిగా గొప్పదిగా కనిపించిన సిబిఐ ఇప్పుడు చంద్రబాబు కళ్లకు భూతంలా కనిపించడం వెనుక కారణమేమిటి?

చంద్రబాబుకు తెలియని భయం పట్టుకుంది. బీజేపీతో తెగదెంపులు చేసుకున్నాడు. మోడీని నానా మాటలన్నాడు. మోడీ, అమిత్‌షాలను చూస్తేనే రాక్షస జంటగా కనిపిస్తున్నారు. రాజకీయ ప్రత్యర్థులను మూడు (మిగతా 11వ పేజీలో)



## సభగా మారిన దీక్ష

### పోరాటం కాదిది.. ఓట్ల ఆరాటం...!



ప్రపంచ రాజకీయాలలోనే సీనియర్ని అని దప్పుకొట్టుకుంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇప్పటి దాకా రాజకీయాలలో అనుసరిస్తున్న ఎన్నో విధానాలను సమూలంగా మార్చేశాడు. అడ్డదారుల్లో చేసే పనులను రాజకీయాల్లో కరెక్టే అనే పరిస్థితి తెచ్చాడు. ఓటును అమ్ముకోవడం, సీట్లను కొనడం, ఎమ్మెల్యేలు, ఎంపీలను కొనడం, ఎలక్షన్‌కో పార్టీతో పొత్తు పెట్టుకోవడం... ఇలాంటి వాటిని చాలా సాధారణ కార్యక్రమాలుగా మార్చేసాడాయన. ఒకప్పుడు పార్టీ మారిన నాయకుడిని ప్రజలు పెళ్ళాం వదిలేసిన మొగుడికంటే ఘోరంగా చూసేవాళ్ళు. ఇప్పుడు ఏడాదికో పార్టీ మారుస్తున్నా ప్రజలు పెద్దగా పట్టించుకోవడం లేదు. అంతా చంద్రబాబు మహిమ. (మిగతా 11వ పేజీలో)



కీ॥శే॥ పులి స్వరూపరెడ్డి గారు

జననం: 28.08.1966 మరణం: 10.11.2018

## ఉత్తరక్రియలు

మమతానురాగాల మణిదీపం, మంచి మనసుకు ప్రతిరూపం
ఆత్మీయతను పంచిన అమృతమూర్తి, మరచిపోలేని మా ఇంటి కీర్తి
మా గుండెల్లో కొలువైన దైవం

**శ్రీమతి పులి స్వరూపరెడ్డి గారు**

తేది. 10.11.2018 శనివారం నాడు స్వర్గస్తురాలైనారు.
వారి పవిత్రాత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ...

తల్లి: కాటంరెడ్డి నవనీతమ్మ
సోదరుడు: కాటంరెడ్డి నిరంజన్‌రెడ్డి
భర్త: పులి అశోక్‌రెడ్డి
కుమారుడు: పులి చరణ్‌రెడ్డి
కుమార్తె: పులి శ్రీస్ఫూర్తి

మరియు

కుటుంబసభ్యులు, మిత్రులు, శ్రేయోభిలాషులు

Staff: P.A.Reddy & Co Chartered Accountants

పెద్దకర్మ : తేది.28.11.2018 బుధవారం, నెల్లూరు, దర్గామిట్ట, సరస్వతీనగర్‌లోని (డోర్ నెం.24/2/670) మా స్వగృహము నందు జరుగును. కావున బంధుమిత్రులకు తెలియజేయడమైనది. సెల్. 99402 66666.

## కస్తూరిదేవి విద్యాలయం కమిటీ

# చరిత్రనెవ్వరూ మార్చలేరు... నిజాలనెవ్వరూ దాచలేరు!


చరిత్ర ఎన్నటికీ మారదు... దానినెవ్వరూ చెరపలేరు. చరిత్ర ఎప్పటికీ మాసిపోదు... దానినెవ్వరూ మసిపూసి మాయ చేయలేరు. దాదాపు 90సంవత్సరాల క్రితం మొదలైంది కస్తూరిదేవి విద్యాలయ ప్రస్థానం. ఆనాటి పెద్దలు ఎన్నో శాసనాలు చేసుకున్నారు. కట్టుబాట్లను రాసుకున్నారు. నియమనిబంధనలను తయారు చేసుకున్నారు. ఇవన్నీ చెరిగిపోని, చెరపలేని అక్షరసత్యాలు. సజీవ సాక్ష్యాలు. కస్తూరిదేవి పురోగతే 'లాయర్' ధ్యేయం, సంస్థ అభివృద్ధే 'లాయర్' ఆశయం. 'లాయర్' పోరాటం ఆరాటం సంస్థ కోసమే తప్ప ఏ ఒక్కరిపైనా కక్షతోనో కార్పణ్యాలతోనో కాదు. 'లాయర్'కి ఎవరితోనూ విభేదాలు లేవు, వివాదాలు అంతకంటే లేవు. 'లాయర్' అందిస్తున్న వాస్తవాలకు అడ్డుకట్ట వేసే ప్రయత్నంలో వ్యక్తిగత విమర్శలకు అర్థరహిత ఆరోపణలకు దిగడం బాధాకరం. 'లాయర్' అంతిమ ధ్యేయం కస్తూరిదేవి విద్యాలయ సంక్షేమమే.

వారం వారం 'లాయర్' అందిస్తున్న "ఇదీ కస్తూరిదేవి కథ"లో ప్రతి అక్షరం అక్షర సత్యం. దశాబ్దాల నాటి చెరిగిపోని శాసనం. చారిత్రాత్మక సంస్థ అసలు కథలో మరికొంత భాగం ఈ వారం నెల్లూరీయుల కోసం...

1959 సెప్టెంబర్ 6వ తేదీన అప్పటి విద్యా శాఖ మంత్రి ఎస్‌బిపి పట్టాభిరామారావు చేతుల మీదుగా కస్తూరిదేవి బాలికల హాస్టల్ భవనానికి ప్రారంభోత్సవం కూడా జరిగింది. కస్తూరిదేవి విద్యాలయం నుంచి రెండు బ్యాచ్‌లుగా విద్యార్థినులు అప్పట్లో సెవన్త్ ఫామ్ పరీక్షలకు హాజరయ్యారు కూడా. ఇతర విద్యా సంస్థల్లో చదువుకునే బాలికలకు కూడా ఇక్కడ వసతి సమకూర్చే వారు. ఆ తర్వాత ఇక్కడ సాంస్కృతిక కార్యక్రమాలను ప్రోత్సహించేందుకు వీలుగా 70వేల రూపాయల వ్యయంతో రిక్రియేషన్ హాల్ కమ్ ఆడిటోరియంను నిర్మించారు. ఇందులో సగం వ్యయాన్ని భరించేందుకు కేంద్రప్రభుత్వం ముందుకు వచ్చి తొలివిడతగా 10వేలు మంజూరు చేసింది. ఈ విద్యాలయం నుంచి ఉత్తీర్ణులైన విద్యార్థినులు తదుపరి కళాశాల విద్యకు అవసరమైన విద్యాలయాలు జిల్లాలో లేకపోవడంతో ఎన్నో ఇబ్బందులు పడేవారు. జిల్లాలో బాలికలకు ఏ కాలేజీ లేకపోవడంతో బాలికలకు కళాశాల నెలకొల్పాలని భావించి శ్రీ వేంకటేశ్వర యూనివర్శిటీ వారి సాయం కోరగా, అందుకు వారు తమవంతు సహకారం అందించేందుకు సమ్మతించారు. 1944-45 నుంచి 1960-61ల దాకా ఈ స్కూల్ ఎన్నో అవస్థలను ఎదుర్కొంటూనే వస్తోంది. ప్రభుత్వం నుంచి వచ్చే గ్రాంట్, విద్యాలయం వద్ద ఉన్న నిధులు అన్నీ కలిసినా నిర్వహణకు చాలినంత నిధులుండేవి కావు.... ఈ విషయాలన్నీ నాటి అధ్యక్షులు ఆనాటి తమ నివేదికలో స్పష్టం చేస్తున్నారు.

అప్పట్లో, అంటే బాలికల విద్యాలయం ప్రారంభమైన తొలినాళ్ళలో(1930 ప్రాంతాల్లో) ఈ విద్యాలయం అభివృద్ధికోసం నాటి కమిటీవారు ఎంతో తపన పడ్డారు. ప్రతి నెలా ఒక రూపాయి చందా ఇచ్చినా, ఏడాదికి 12 రూపాయల చందా ఇచ్చినా, వంద రూపాయల మొత్తాన్ని ఒకేసారిగా విరాళంగా ఇచ్చినా వారిని సభ్యులుగా చేర్చుకోవాలని కూడా తీర్మానించుకున్నారు. అప్పట్లో రూపాయంటే చిన్నవిషయమేమీ కాదు. ఇవన్నీ సంస్థ పురోగతి కోసం ఆనాడు వారు చేపట్టిన కార్యక్రమాలే.




### బాలికల విద్యాభివృద్ధి కోసం.. 'ఎడ్యుకేషనల్ కౌన్సిల్' ఏర్పాటు...

కస్తూరిదేవి విద్యాలయం నిర్వహణకు సంబంధించి ఒక కమిటీని ఏర్పాటుచేసుకోవాలని, విద్యాలయానికి సంబంధించిన అన్ని అధికారాలు కమిటీకే ఉండాలని తీర్మానించి 1931లో ఆ మేరకు ఒక కమిటీ ఏర్పాటు చేసుకున్నారు. విద్యాలయం ఆస్తులకు సంబంధించి కానీ, విద్యాలయం సక్రమ నిర్వహణకు, విద్యాలయం పురోగతికీ ఎప్పటికప్పుడు తగు నియమాలు చేసేందుకు, అవసరమైన నిర్ణయాలు తీసుకునేందుకు ఈ కమిటీకి అధికారం ఉండాలని నిర్ణయించుకుని ఆ కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. దీంతోపాటు, ప్రత్యేకించి బాలికల విద్యాభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకునేందుకు ఆ కమిటీకి అనుబంధంగా విద్యా వేత్తలతో కూడిన ఒక 'ఎడ్యుకేషనల్ కౌన్సిల్'ని కూడా ప్రత్యేకంగా ఎన్నుకున్నారు. అప్పట్లో శ్రీయుతులు రేబాల పట్టాభి రామిరెడ్డి, రేబాల సుబ్బారెడ్డి కుమారుడు సుబ్బరామిరెడ్డి, బెజవాడ గోపాలరెడ్డి, శ్రీమతి పొణకా కనకమ్మ, ఒరుగంటి వెంకటసుబ్బయ్య, రాళ్ళపల్లి రామసుబ్బయ్య, కె.వి రాఘవాచార్యులు, పందిపాటి సుబ్బరామిరెడ్డి, మామిడిపూడి వెంకమ్మగార్లు సభ్యులుగా ఉండగా, వీరిలో ఈ కమిటీకి కెవి రాఘవాచార్యులును అధ్యక్షులుగా, రేబాల పట్టాభిరామిరెడ్డిని ఉపాధ్యక్షులుగా, శ్రీమతి పొణకా కనకమ్మ కార్యదర్శిగా ఉండాలని తీర్మానించారు. కొద్ది రోజుల తర్వాత మామిడిపూడి వెంకమ్మగారు రాజీనామా చేయగా, ఆమె స్థానంలో యానాటి చెంచుపోలమ్మగారిని సభ్యురాలిగా కో-ఆప్ట్ చేసుకున్నారు. ఎడ్యుకేషనల్ కౌన్సిల్‌కు ప్రముఖ విద్యావేత్త మామిడిపూడి వెంకటరంగయ్యగారిని అధ్యక్షులుగా ఎన్నుకున్నారు.

శ్రీయుతులు రాళ్ళపల్లి రామసుబ్బయ్య, పొణకా పిచ్చిరెడ్డి, ఒరుగంటి వెంకటసుబ్బయ్య, పొణకా కనకమ్మతో కలిసి మొత్తం ఐదుగురు ఈ కౌన్సిల్‌లో ఉంటూ బాలికల విద్యాభ్యున్నతికి అవసరమైన నిర్ణయాలు తీసుకునేవారు.

1932 ఫిబ్రవరిలో నాటి రాజకీయ వాతావరణంలో పొణకా కనకమ్మ, ఒరుగంటి వెంకట సుబ్బయ్య, బెజవాడ గోపాలరెడ్డి, వేనాటి చెంచు పోలమ్మ గార్లు కమిటీకి రాజీనామాలు సమర్పించి నాటి స్వాతంత్ర్యోద్యమంలో కీలకపాత్ర పోషించారు. ఆ సమయంలో ఈ కమిటీకి శ్రీయుతులు యేనుగ రాఘవరెడ్డి, పొణకా పిచ్చిరెడ్డి దేవరపల్లి వెంకట కృష్ణారెడ్డిలు సభ్యులుగా ఉండి కమిటీకి తమ అండదండలందించారు. 1932 ఫిబ్రవరి 4వ తేదిన జరిగిన కమిటీ సమావేశంలో, ఈ విద్యాలయానికి వారణాశి సుబ్రహ్మణ్యంగారిని ఉపాధ్యాయునిగా నియమిస్తూ నెలకి 15 రూపాయల జీతాన్ని ఆయనకు ఇవ్వాలని నిర్ణయించారు. ఆ తర్వాత రోజుల్లో మారుతున్న రాజకీయ పరిణామాల్లో వారందరికీ అనుకూల వాతావరణం ఏర్పడడంతో మళ్ళీ అందరూ ఈ విద్యాలయాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడానికి సంకల్పించుకున్నారు.

### 1946లో శ్రీ కస్తూరిదేవి విద్యాలయ కమిటీ నిర్మాణం :

శ్రీ కస్తూరిదేవి విద్యాలయం అభివృద్ధికి 1946 మే 2వ తేది జరిగిన ప్రత్యేక సమావేశంలో 'శ్రీ కస్తూరిదేవి విద్యాలయ కమిటీ' అనే పేరుతో దీనిని వాడుకలో వ్యవహరించాలంటూ కమిటీని నియమించుకుని ఆ కమిటీకి స్పష్టమైన విధి విధానాలు నిర్ణయించుకున్నారు. బాలికల విద్యాభివృద్ధికి తోడ్పడడం ఇందులో ప్రధానమైన ఉద్దేశ్యం. కమిటీ వారిచే, ప్రస్తుత కాల పరిస్థితులకు అనుగుణంగా సాధారణ, బాలికలకు సాంకేతిక విద్యాసౌకర్యాలు కలుగజేయడం, పై ఉద్దేశ్యాల మేరకు బాలికా పాఠశాలలు, కళాశాలలు నిర్మించడం, ధన వసతులనుసరించి రెసిడెన్షియల్ సంస్థలుగా వాటిని మార్చడం, సదరు సంస్థల సహాయార్థం ఆస్తిని, ధనాన్ని సేకరించడం కమిటీ ఉద్దేశ్యాలుగా నిర్ణయించుకున్నారు. కమిటీవారిచే 16-7-1944న స్థాపించబడి, 'శ్రీ కస్తూరిదేవి బాలికోన్నత పాఠశాల -నెల్లూరు' అని పిలవబడే బాలికా పాఠశాలను పోషించడం, ఎండోమెంట్లు, బహుమతులు, ఇతర పారితోషికములను స్థాపించడం, సంస్థ ఆశయ వ్యాప్తికి కమిటీవారు యుక్తమని భావించు ఇతర చర్యలను జరిపించడం ఈ కమిటీ ఉద్దేశ్యాల్లో ముఖ్యమైనవిగా పేర్కొన్నారు. అంతేకాక, కమిటీ నిర్మాణం, నిబంధనలు, నియమాలు కూడా అత్యంత పకడ్బందీగా, స్పష్టమైన రీతిలో ఈ క్రిందివిధంగా కమిటీ నిర్మింపబడాలని కూడా పేర్కొన్నారు. వారు పేర్కొన్న విధంగానే ఆ వివరాలు యధాతథంగా ఇవీ!...

### కమిటీ నిర్మాణం.. నిబంధనలు, నియమాలు...

కమిటీ సభ్యులు తొమ్మండుగురు. అధ్యక్షుని, కార్యదర్శిని, కోశాధిపతిని కమిటీ సభ్యులు వారిలోనే ఎన్నుకొనవలయును. కార్యదర్శిని కోశాధిపతిని కూడా నియమించుటకు కమిటీకి అధికారము కలదు. పై తొమ్మిది స్థానములు ఈ క్రిందివిధంగా ఏర్పాటు చేయబడును.

1. ఉదారంగా 50,000 రూపాయలు విరాళమొసంగి, కమిటీకి శ్రీ కస్తూరిదేవి గరల్స్ హైస్కూలు ప్రారంభించుటకు దోహదమిచ్చి, పాఠశాల నేటి స్థితికి కారకులైన పోషకులు శ్రీ తిక్కవరపు రామిరెడ్డి గారికి ఒక స్థానం రిజర్వు చేయబడవలెను. వారి జీవితపర్యంతము సభ్యులుగా నుండుటయే గాక, వారికి తర్వాత ఆ స్థానమునకు మరియొకరిని నియమించుటకు వారికి హక్కు గలదు. ఈ విధముగ నియమింపబడిన సభ్యుడు తన జీవితపర్యంతము సభ్యుడుగ ఉండి, తదనంతరము పైవిధంగా మరియొకరిని నియమించుటకు అధికారము గలదు. ఇదేవిధముగ చిరస్థాయిగా ఈ నియామకము జరుగుచుండవలయును. ఏ కారణంచేతనైనా, ఆ స్థానంలో ఉండేవారెవరైనా తన తదనంతరపు వారసుని నియమించుకొనని సందర్భంలో, పోషకుని వంశంలో పెద్దవాడైన పురుష సభ్యుడుగాని, అతను లేనప్పుడు కమిటీ గాని, ఆ స్థానానికి వారసుణ్ణి, పోషకుని వంశంలోని వారి నుండి నియమిస్తుంది. ఆ విధంగా నియమింపబడ్డ వారసుడు, తన తర్వాత వారసుణ్ణి నియమించుకొను హక్కు కలిగియుండును.

2. సదరు సంస్థ స్థాపకురాలగు శ్రీమతి కనకమ్మ గారికి, వారి జీవితపర్యంతమూ ఆ కమిటీలో ఒక స్థానం ఉండవలయును. వారి తదనంతరం సదరు స్థానమును కమిటీ వారిచే, కమిటీ తీర్మానించు విధంగా భర్తీ చేయబడును.

3. వందరూపాయలు మొదలు రెండు వేల రూపాయల వరకు విరాళమిచ్చిన దాతలచే రెండు స్థానములు ఎన్నుకొనబడవలయును. అట్లు ఎన్నుకొనబడిన సభ్యులు వెయ్యి రూపాయలు మొదలు రెండువేల రూపాయల వరకు విరాళములు ఇచ్చిన వారుగా ఉండవలయును.

4. రెండు వేల రూపాయలకు పైబడి విరాళమిచ్చిన దాతలు తమనుండి ఇద్దరు సభ్యులను యెన్నుకొనవలయును.

5. శ్రీ కస్తూరిదేవి విద్యాలయ కమిటీకి అంగీకరించబడ్డ పాఠశాల పాత విద్యార్థినుల సంఘము తరపున ఇద్దరు సభ్యులను ఎన్నుకొనవలయును. ఈ నిబంధన 1960వ సంవత్సరారంభం నుంచి అమలులోకి రావలెను. అంతవరకు పై నమోదు చేయబడిన ఆరుగురు సభ్యులచే సదరు రెండు స్థానములు కోఆప్టు చేయబడవలసినది.

6. ఒక సభ్యుని సదా పై ఎనిమిదిమంది సభ్యులు కో-ఆప్టు చేసుకొనవలసినది. ఎన్నుకొనబడిన సభ్యులు గాని, కోఆప్ట్ కాబడిన సభ్యులుగాని, వారికి ప్రస్తుతమున్న సభ్యత్వకాలము అయిపోయిన తరువాత, మరల వారే ఎన్నికగుటకు, కోఆప్టు చేసుకోబడుటకు ఆక్షేపణ లేదు. కమిటీగాని, కమిటీచే అధికారం పొందిన వ్యక్తిగాని, ఎక్కువమందిగాని ఎన్నికలు జరుపుటకు అధికారులుగా ఉంటారు. అలాంటి విషయాలన్నిటిలో కమిటీ యొక్క తీర్మానమే తుది నిర్ణయంగా పరిగణించబడును. ఎలక్షన్ సక్రమ నిర్వహణకు అవసరమైన బైలాలను తయారు చేయుటకు కమిటీకి అధికారమివ్వబడును. మేజరు పొందనివారు కమిటీ సభ్యులుగ నుండుటకు అనర్హులు. మతిభ్రమణము కలవారుగాని, ఇన్‌సాల్వెంట్‌గా తీర్మానింపబడినవారు గాని సభ్యులుగా ఉండగూడదు.

### ఈ క్రింది సభ్యులతో.. నాటి కమిటీ ఇదీ...

ఈ క్రింద పేర్కొన్న సభ్యులతోటి ఏర్పడిన కమిటీ 30-6-1949వరకు గాని, లేక పై చెప్పబడిన రీతిగా క్రొత్త సభ్యులు నియమింపబడునంతవరకు గాని తమ సభ్యత్వమును కలిగియుండురు. కమిటీ సభ్యులు 1. శ్రీ తిక్కవరపు రామిరెడ్డిగారు, 2. శ్రీమతి పొణకా కనకమ్మగారు, 3. శ్రీ బెజవాడ గోపాలరెడ్డిగారు, 4. శ్రీ గ్రిద్దలూరు సాంబశివ రావుగారు, 5. శ్రీ నెల్లూరు వెంకట్రామానాయుడు గారు, 6. శ్రీ రేబాల దశరథరామిరెడ్డిగారు, 7. శ్రీ రేబాల పట్టాభిరామిరెడ్డిగారు, 8. ఏ.సి సుబ్బారెడ్డి గారు, 9. ఖాళీ. (అప్పట్లో ఈ స్థానం ఖాళీగానే ఉంది). పై చెప్పబడిన కాలపరిమితి లోపల యేదైనా ఖాళీపడిన సదరు స్థానములను కమిటీలోని ఇతర సభ్యులచే భర్తీ చేయబడవలయును. ఖాళీకాబడిన స్థానములో ఇదివరకుండిన సభ్యుడు ఎంతకాలము వరకు సభ్యత్వమును కలిగియుండియుండునో అంతవరకు ఇప్పుడు నియమింపబడిన సభ్యుడు సభ్యత్వము కలిగియుండును. కమిటీ నియమింపబడిన తేదీ లగాయతు దానిలోని సభ్యులు అయిదు సంవత్సరముల వరకు గాని, లేక మరియొక కమిటీ నియమింపబడునంతవరకు గాని తమ సభ్యత్వమును కలిగియుండురు. ప్రస్తుతం పనిచేసే కమిటీవారు నిర్ణయించు తేదీనాటికి క్రొత్త కమిటీ పై నిబంధనలననుసరించి ఏర్పాటు కావలయును.

(మిగతా కథ వచ్చే వారం)

## కస్తూరిదేవి వివాదంలో.. పాతపేపరు కొత్త పంథా..

## అసలు అంశాన్ని వదిలి వ్యక్తిగత దూషణలు

# అయ్యా సంపాదకా!.. ఇదేం సంస్కారం?

*శ్రీ కస్తూరిదేవి విద్యాలయం విషయంలో 'లాయర్'ది ఎప్పుడూ ఒకే పంథా. సంస్థ అభివృద్ధి కోసం ఎవరు పనిచేస్తే వారికి అండగా నిలవడం, సంస్థను కాజేసే ప్రయత్నం చేసేవాళ్ళను, వారికి వత్తాసు పలికేవాళ్ళను ఆమడదూరం తరిమికొట్టడం. ఇదే తరహాలో ఇప్పుడు గత రెండు వారాలుగా 'లాయర్' తన వాదాన్ని వినిపిస్తోంది. అయితే పాతపేపరు సంపాదకుడు గత వారం తన పేపరులో అసలు అంశాన్ని వదిలి విషయాన్ని ప్రక్కదోవ పట్టించే ప్రయత్నం మొదలుపెట్టాడు.*

అయ్యా సంపాదకా... ఇది మనిద్దరి వ్యక్తిగత సమస్య కాదు, ఆస్తి తగాదానో, సరిహద్దు తగాదానో అంతకంటే కాదు. కస్తూరిదేవి విషయంలో అసలు అంశాన్ని ప్రక్కనపెట్టి సమాధులు, విగ్రహాలు, రౌడీలు, న్యాయబృందం, మాఫియా, ముడుపులూ... అంటూ వ్యక్తిగత దూషణలకు దిగావు.

శ్రీమాన్ తాళ్ళపాక అన్నమాచార్యులు, అమర గాయకులు ఘంటసాల, హరికథా భిక్షువు శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తి, డా॥ బెజవాడ గోపాలరెడ్డి వంటి మహనీయుల విగ్రహాలు రేపటి తరానికి స్ఫూర్తిదాయకం కావాలనే సంకల్పంతో, శ్రీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, శ్రీపతి పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యం, శ్రీ తిక్కవరపు సుబ్బరామిరెడ్డి వంటి వారితో పాటు కమిటీగా ఏర్పడిన మరికొందరు పెద్దల కోరిక మేరకు ఆయా విగ్రహాలు నెలకొల్పడానికి సమన్వయకర్తలుగా వ్యవహరించిన వాళ్ళని విమర్శిస్తూ ఆ మహనీయుల విగ్రహాలను సమాధులతో పోల్చావు.. ఇదేనా నీ సంస్కారం? ఇదే నా నీవు నేర్చుకున్న పాత్రికేయం? విగ్రహాల పేరుతో చందాలు దండి దెవరో ఆ విగ్రహాలు వున్న చోటుని విగ్రహాలతో సహా అమ్ముకున్నదెవరో నెల్లూరోళ్ళకి బాగా తెలుసు.

ఇక సన్మానాలంటావా... నీకెవ్వడూ సన్మానం చెయ్యడు, ఇంకొకరిని సన్మానించే మనస్తత్వం గాని, మంచిని సత్కరించే లక్షణాలు గాని నీకు లేవు. అసలు సన్మానాలు సత్కారాల విషయం మాట్లాడే అర్హతే నీకు లేదు.

అక్టోబర్ 9వ తేదీ కస్తూరిదేవి విద్యాలయ ప్రాంగణంలో కమిటి సమావేశం జరుగుతుంటే మీడియా పేరుతో ఓ పదిమందిని వెంటబెట్టుకుని పిలవని పేరంటానికి తగుదునమ్మా అంటూ వెళ్ళి కమిటి సమావేశంలో దౌర్జన్యంగా జొరబడ్డ నీదా మాఫియా పోకడ... లేక సంస్థ పురోగతి కోసం పోరాటం చేస్తున్న వ్యక్తులదా అన్నది నీ విజ్ఞతకే వదిలేస్తున్నాం.

చట్ట వ్యతిరేక చర్యకు పూనుకున్న నీపై చట్ట పరమైన చర్యలకు ఉపేక్షిస్తే నీపై పోరుకి న్యాయవాద బృందాన్ని పెట్టారంటూ నీకు నువ్వే పెద్ద హీరోగా చిత్రీకరించుకుంటూ వార్తలు రాసుకున్నావు. అబ్బా... ఏమి టాలెంటయ్యా నీది! ఇక కస్తూరిదేవి వివాదంలో ఎలాంటి అనుమానాలు అపోహలూ వున్నా ఎల్లవేళలా నివృత్తి చేయడానికి చిట్టమూరు ప్రవీణ్‌కుమార్‌రెడ్డిని మీడియా ప్రతినిధిగా కమిటి నియమిస్తే ఆయనను ఓ డాన్‌లా చిత్రీకరించావు. అంతేకాకుండా 50లక్షల రూపాయలతో ప్యాకేజీ డీల్ ఇచ్చారని, నీ గుణాలను మాకు ఆపాదించావు, ఏంది నాయనా నీ తపన...? అసలేం చెప్పాలనుకుంటున్నావు... ఏం సాధించాలను కుంటున్నావు.. ఎవరిని బెదిరించాలని చూస్తున్నావు...?

ఎనిమిది పదులు పైబడిన వయస్సులో జి.వి.కె.రెడ్డి కస్తూరిదేవి అభివృద్ధి కోసం ముందుకొచ్చి తన ఆలోచనలను అమలు చేయగల సమర్ధుడిగా పి.వి.ప్రసన్నరెడ్డిని తన ప్రతినిధిగా నియమించుకుంటే ప్రసన్నరెడ్డిని రౌడీగా అభివర్ణించావు. ప్రసన్నరెడ్డి వ్యక్తిత్వం, సమర్ధత ఏపాటిదో 1991-92 సమయాలలో కళ్యాణి ఫిలింస్ చుట్టూ ప్రదక్షిణ చేస్తుండిన నీకు తెలియదా..? గతం మర్చిపోయావా...?

నీకు చేతనైతే కస్తూరిదేవి అంశంపై పోరాడు, నీ ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడానికి మేం సిద్ధం. నీకు నిజాయితీ వుంటే మా ప్రశ్నలకు కూడా సమాధానాలివ్వు. అంతేకాని, అసలు విషయాన్ని ప్రక్కనపెట్టి విగ్రహాలూ.. సమాధులూ... అంటూ ఎందుకయ్యా విషయాన్ని దారి మళ్ళించాలని చూస్తున్నావ్..?

ఎవరిపైనా వ్యక్తిగత విమర్శలు చేయడం మా అభిమతం కాదు. జరిగిన విషయాలను జరుగుతున్న వాస్తవాలను సాక్ష్యాలతో సహా నెల్లూరీయులకు చెప్పడమే మా ధ్యేయం. అలాకాదని మాపై వ్యక్తిగత దూషణలకు నువ్వు శ్రీకారం చుడితే నీకు ధీటుగా సమాధానం చెప్పడానికి మేం ఎప్పుడూ సిద్ధమే.

## కస్తూరిదేవి అభివృద్ధి కోసం.. ఇన్నాళ్ళూ.. ఇన్నేళ్ళూ..

# నందనారెడ్డి ఏం చేసింది?

*తిక్కవరపు రామిరెడ్డి గారి మనుమరాలుగా తనకు వారసత్వ హక్కు వుంది అంటూ పాతపేపరు వేదికగా నానా యాగీ చేస్తూ... మీడియా ముందుకు రావడమే కాకుండా జి.వి.కె.రెడ్డికి బహిరంగ లేఖ అంటూ ఓ 4పేజీల ప్రశ్నావళిని సంధించిన ఇష్‌బెలియా నందన పూరఫ్ నందనరెడ్డి సమాధానాలివ్వవలసిన ప్రశ్నలు చాలానే వున్నాయి.*

★ 2018 అక్టోబర్ 9వ తేదీన తొలిసారిగా జి.వి.కె.రెడ్డిని చూశానంటున్నారు. మరి అంతకు ముందు జరిగిన పలు కమిటి సమావేశాలకి ఆయన హాజరయ్యారు, అప్పుడు మీరేమయ్యారు?

★ అసలు మీ తాతగారైన తిక్కవరపు రామిరెడ్డి గారిని మీరెప్పుడైనా చూశారా? మీ నాన్నగారు వివాహం చేసుకున్న వెంటనే మీ తాతను విడిచి వెళ్ళిపోయాడు. దాదాపు 30సంవత్సరాలు ఒకొరినొకరి చూసుకోలేదన్నది వాస్తవం. 1973 డిసెంబర్ 9న మీ తాతగారు దివంగతులైనారు. మరి మీ తాతని మీరెప్పుడు కలిశారు?

★ మీ నాన్న తిక్కవరపు పట్టాభి కూడా మిమ్మల్ని కొన్ని సందర్భాలలో దూరంగా పెట్టారని తెలుస్తోంది... అందుకు గల కారణాలు ఏమిటి? మీ పేరు ఇష్‌బెలియా నందనారెడ్డి అని అంటారు, అలా ఎందుకొచ్చింది..? ఒకవేళ మీరు ఇష్‌బెలియా అయితే తిక్కవరపు కుటుంబ వారసురాలెలా అవుతారు..?

★ 2006 నుండి 2012 వరకు మీరు కమిటీలో వున్నానని పదేపదే చెప్తున్నారు. ఈ ఆరేళ్ళ కాలంలో కమిటి సభ్యురాలిగా, అధ్యక్షురాలిగా సంస్థ అభివృద్ధి కోసం మీరు చేపట్టిన సంస్కరణలు ఏమిటి..? మీరిచ్చిన విరాళం ఎంత...?

★ స్కూల్ మరియు కాలేజీలలో నిధుల కొరతతో జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితులలో గత పది సంవత్సరాలుగా అనేక పర్యాయాలు నెలకి రూ.2లక్షలు తక్కువ కాకుండా సుమారు కోటి రూపాయలకుపైగా జి.వి.కె.రెడ్డి ఇచ్చారు... ఈ సమయంలో మీరు ఒక్క రూపాయైనా ఇచ్చారా...? ఇచ్చుంటే.. ఎంతిచ్చారు?

★ బెంగుళూరులో ప్రముఖ బిల్డర్‌గా పేరుగాంచిన లయన్స్ క్లబ్ అంతర్జాతీయ సభ్యుడు వేణుంబాక వెంకటకృష్ణారెడ్డిని మీ చొరవతో 2006లో సభ్యుడిగా కమిటీలోకి తెచ్చారు. ఆయనను ఏ అర్హతతో లేదా ఏ వారసత్వంతో కమిటీలోకి ఆహ్వానించారు.

★ 2006-2012 మధ్యకాలంలో సంస్థ ఆస్తులను అమ్మేసి లేదా జాయింట్ డెవలప్‌మెంట్‌కి కృష్ణారెడ్డికి ఇచ్చేసి ఊరు బయట వంద ఎకరాలు కొందామని సూచించింది మీరు కాదా...? మీ సూచనను త్రోసిపుచ్చింది అప్పటి కమిటి సభ్యులు జి.వి.కె.రెడ్డి, పి.వి.ప్రసన్నరెడ్డి, జె.వి.రెడ్డి తదితరులు కాదా...? ఈ విషయం ప్రస్తుతం మీరు వేదికగా వాడుకుంటున్న పాతపేపరులో కూడా రాలేదా? మరి దీనికి మీరేమంటారు?

★ సుమారు 50లక్షల రూపాయలతో విద్యార్థినుల కోసం టాయిలెట్లు అలాగే విరిగిన తలుపులు, బెంచీలు బాగుచేసి, మౌలిక సదుపాయాలను తక్షణమే చేపట్టే దిశగా ప్రస్తుత కమిటి చర్యలు చేపట్టింది. మరి ఇన్నేళ్ళు అధ్యక్షురాలిగా వున్న మీరేం చేశారు.?

★ కస్తూరిదేవి గార్డెన్స్ పేరుతో కళ్యాణ మండపం నడుపుతున్న వారిని మీరు పిలిపించుకుని ఖాళీ చేయొద్దని ఎందుకు చెప్పారు? మరి సంస్థ బాగు కోసం మీ జీవితం అంకితం చేస్తానని వాగ్దానాలు చేస్తున్న మీరు ఇలా చెప్పడం సబబేనా?

★ గతంలో మీరు సంస్థను కంటికి రెప్పలా కాపాడారు.. అంటూ జె.వి.రెడ్డి గారిని ఈ-మెయిల్స్ ద్వారా అభినందించి, ఇప్పుడు ప్లేటెందుకు ఫిరాయించారు.

*పై ప్రశ్నలన్నిటికీ సమాధానం చెప్పవలసిన బాధ్యత నందనారెడ్డిపై వుంది. గతంలో కమిటి సమావేశం జరిగే ప్రాంతానికి వచ్చిన ప్రత్యూషారెడ్డిని నీకక్కడేం పని అని గదమాయించి తరిమేసిన నందనారెడ్డి, ఇప్పుడు అదే ప్రత్యూషారెడ్డిని ప్రక్కన పెట్టుకుని ఉద్యమం చేస్తాననడం హాస్యాస్పదంగా వుంది.*

## ఫోర్బ్స్.. భారతదేశపు 100 మంది అత్యంత ధనికుల్లో..

# ముగ్గురు తెలుగోళ్ళు... వారిలో ఇద్దరు నెల్లూరీయులు



పి.వి.రామ్ ప్రసాద్‌రెడ్డి

ఇది ఖచ్చితంగా ప్రతి నెల్లూరీయుడూ గర్వించదగ్గ విషయం. భారతదేశం మొత్తంలో వున్న ధనికుల్లో అత్యధిక ధనవంతులైన వందమందిలో ముగ్గురు తెలుగువారుంటే, వారిలో ఇద్దరు నెల్లూరీయులు. ఇండియా ఫోర్బ్స్ పత్రిక జరిపిన సర్వేలో ముందు వరుసలో వున్న వంద మంది పేర్లను డిసెంబర్ 2018 సంచికలో ఆ పత్రిక ప్రచురించింది.

రిలయన్స్ ఇండస్ట్రీస్‌కి చెందిన ముఖేష్ అంబానీ మొదటి స్థానంలో వుండగా మేఘా ఇంజనీరింగ్ కంపెనీ సారధి పి.పిచ్చిరెడ్డి 47వ స్థానంలోనూ, అరవిందో ఫార్మా సంస్థల ఛైర్మెన్ పి.వి.రామ్ ప్రసాద్‌రెడ్డి 50వ స్థానంలోనూ రిలయన్స్ కమ్యూనికేషన్స్ నిర్వాహకుడు అనిల్ అంబాని 68వ స్థానంలోనూ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ కుటుంబం 93వ స్థానంలోనూ వున్నట్లు ఈ పత్రిక ప్రచురించింది.

50వ స్థానంలో నిలచిన పి.వి.రామ్ ప్రసాద్‌రెడ్డి, ఆయనతో పాటు 93వ స్థానంలో నిలిచిన రెడ్డీస్ కుటుంబసభ్యుడు, సంస్థ సారధి గునుపాటి వెంకటప్రసాద్‌రెడ్డి ఇద్దరూ నెల్లూరీయులే. దేశవ్యాప్తంగా



జి.వి.ప్రసాద్‌రెడ్డి

మొదటి 100మంది ధనికుల్లో ముగ్గురు తెలుగోళ్ళ మధ్యలో ఇద్దరు నెల్లూరుకు చెందిన వారుండడం ప్రపంచవ్యాప్తంగా వున్న ప్రతి నెల్లూరీయుడికీ గర్వకారణమైన విషయం. రామ్‌ప్రసాద్ మరియు జి.వి. ప్రసాద్‌లకు "లాయర్" శుభాకాంక్షలు.

# విపిఆర్‌కి మరో కీలకపదవి

## టెలికం అడ్వైజరీ కమిటి జిల్లా ఛైర్మెన్‌గా నియామకం



ఇటీవలే పార్లమెంటరీ హోంశాఖ స్థాయి సంఘం సభ్యులుగా నియమితులైన పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని మరో కీలకపదవి వరించింది. కేంద్ర టెలికమ్యూనికేషన్స్ మంత్రిత్వ శాఖ నెల్లూరుజిల్లా టెలికమ్ అడ్వయిజరీ కమిటి ఛైర్మెన్‌గా ఆయనను నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో టెలికం సేవలు మెరుగుపరిచే విధంగా కృషి చేసేందుకు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి వచ్చిన మంచి అవకాశమిది.

తనకు ఈ బాధ్యతను అప్పగించిన కేంద్ర కమ్యూనికేషన్స్ మంత్రికి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలుపుతూ, ఈ పదవిని ఒక బాధ్యతగా చూస్తానని, జిల్లాలో టెలికం సేవలను మెరుగు పరచి, వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని, 4జీ సేవలు, వైఫై హాట్‌స్పాట్ సేవలు విస్తృత పరిచేందుకు శ్రమిస్తానని ఈ సందర్భంగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తెలియజేశారు.

## ‘ప్రభా’తం

# కాంగ్రెస్‌కే కీలకం!

మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, రాజస్థాన్, మిజోరం... ఈ నాలుగు రాష్ట్రాల ఫలితాలన్నీ ఒకెత్తు... అక్కడ కాంగ్రెస్ గెలిచినా, ఓడినా అది ఆ పార్టీ సొంతం. వీటిలో ఎక్కడ గెలిచినా స్థానిక బీజేపీ ప్రభుత్వాలపై వున్న వ్యతిరేకతతో కాంగ్రెస్ గెలిచినట్లే! కాని వీటికి భిన్నంగా తెలంగాణ ఎన్నికల ఫలితాల ప్రభావం వుంటుంది. మహాకూటమి ప్రయోగానికి తెలంగాణ ఒక వేదికయ్యింది.

దేశవ్యాప్తంగా 5 రాష్ట్రాల ఎన్నికల సమరం కొనసాగుతోంది. మూడు రాష్ట్రాలలో ప్రధాన పోటీ బీజేపీ - కాంగ్రెస్‌ల మధ్యే ఉండబోతోంది. రెండు రాష్ట్రాలలో స్థానిక ప్రాంతీయ పార్టీలతో కాంగ్రెస్సే పోటీపడుతోంది. ఎటుచూసినా ఈ ఎన్నికలు కాంగ్రెస్‌కే జీవన్మరణ సమస్య. 2019లో కేంద్రంలో ఎలాగైనా జెండా పాతి, రాహుల్‌ను ప్రధానిగా చూడాలనుకుంటున్న సోనియాగాంధీ కలలకు ఈ ఎన్నికలు ఒక ఆశాకిరణం.

మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, రాజస్థాన్, మిజోరం... ఈ నాలుగు రాష్ట్రాల ఫలితాలన్నీ ఒకెత్తు... అక్కడ కాంగ్రెస్ గెలిచినా, ఓడినా అది ఆ పార్టీ సొంతం. వీటిలో ఎక్కడ గెలిచినా స్థానిక బీజేపీ ప్రభుత్వాలపై వున్న వ్యతిరేకతతో కాంగ్రెస్ గెలిచినట్లే! కాని వీటికి భిన్నంగా తెలంగాణ ఎన్నికల ఫలితాల ప్రభావం వుంటుంది. మహాకూటమి ప్రయోగానికి తెలంగాణ ఒక వేదికయ్యింది. ఇక్కడ బీజేపీ స్థానంలో టిఆర్ఎస్ అనే ప్రాంతీయ పార్టీ వుంది. అయితే ఆ ఒక్క ప్రాంతీయ పార్టీని దించడం కోసం కాంగ్రెస్, తెలుగుదేశం, టిజెఎస్, సిపిఐ పార్టీలు కూటమి కట్టాయి. సీట్ల సర్దుబాటుకు దిగాయి. టిఆర్ఎస్‌పై కలిసికట్టు పోరాటానికి సిద్ధమయ్యాయి. తెలుగుదేశం పార్టీ పునాది సిద్ధాంతమైన తెలుగువాడి ఆత్మగౌరవాన్ని హుస్సేన్‌సాగర్‌లో ముంచేసి తెలుగుదేశం అధినేత చంద్రబాబు కాంగ్రెస్‌తో పొత్తుకు తెగించాడు. ఆ రెండు పార్టీల ప్రేమబంధం ఎంత బలమైనదో రేపు తెలంగాణ ఫలితాలలో తేటతెల్లం కాబోతోంది.

తెలంగాణలో టిఆర్ఎస్ ఓ పక్క, మహాకూటమి మరోపక్క అధికారం కోసం పోటీపడుతుండగా మధ్యలో బీజేపీ సైతం అన్ని స్థానాలలో అభ్యర్థులను నిలిపి ఆ రాష్ట్రంలో తమ ఓటు బ్యాంకును పెంచుకునే దిశగా పోరాడుతోంది. తాము అధికారంలోకి రాలేమని ఆ పార్టీ నాయకత్వానికి తెలుసు. కాని వారి టార్గెట్ కాంగ్రెస్‌ను అధికారంలోకి రాకుండా చేయడం. ఇక్కడ టిఆర్ఎస్ తిరిగి గెలవడం బీజేపీ లక్ష్యం. ఇక ఎంఐఎం పాత్ర హైదరాబాద్ నగరానికి పరిమితం కానుంది. వాళ్ళకు టిఆర్ఎస్ గెలిచినా, మహాకూటమి గెలిచినా పెద్ద తేడా వుండదు.

2014 ఎన్నికల్లోనే కాంగ్రెస్‌వాళ్ళ చేతికి అధికారం వచ్చినట్లే భావించారు. అయితే వారి ఆశలను కేసీఆర్ అడియాశలు చేశాడు. తెలంగాణ ఇస్తే టిఆర్ఎస్‌ను కాంగ్రెస్‌లో విలీనం చేస్తానని సోనియాగాంధీకి ఇచ్చిన మాటను ‘తూచ్’ అన్నాడు. దేశానికి స్వాతంత్ర్యం ఇచ్చిన ఎలిజబెత్ రాణిని ఎవరూ అనుకోలేదు. స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహాత్మాగాంధీనే ప్రజలు గౌరవించారంటూ లాజిక్‌లో మాట్లాడి కాంగ్రెస్ అధిష్టానానికి ఊహించని షాకిచ్చాడు. కాంగ్రెస్‌లో టీఆర్ఎస్‌ను విలీనం చేయ్యకుండా సొంతంగా పోటీకి దిగాడు. ఆంధ్రాను నిలువునా ద్రోహం చేసి తెలంగాణను బంగారు పళ్లెంలో పెట్టిచ్చినా కూడా ఆ రాష్ట్ర ప్రజలు ఆ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను కనికరించలేదు. 2014 ఎన్నికలలో అటు తెలంగాణలో వస్తుందనుకున్న అధికారం రాకపోగా, దేశంలోనే ఎంతో బలంగా వున్న ఆంధ్రప్రదేశ్‌లో ఆ పార్టీ మట్టిగొట్టుకుపోయింది. ఈ ఎన్నికల్లో కూడా ఆ పార్టీ అధికారంలోకి రాలేకపోతే ఇక తెలంగాణలో ఆ పార్టీ మనుగడే కష్టంగా మారే అవకాశముంది. అందుకే ఎంతకు దిగజారైనా గెలవాలనే లక్ష్యంతో తెలుగుదేశంతో సైతం పొత్తు కుదుర్చుకుంది. అయితే ఈ పొత్తు ఫలితం రేపు ఓటింగ్‌లో ఎలా వుండబోతుందోగాని సీట్ల పంపకాలలో మాత్రం తేడా చూపించింది. పలుచోట్ల టిక్కెట్లు రాని కాంగ్రెస్ నాయకులు తిరుగుబాటు అభ్యర్థులుగా రంగంలోకి దిగారు. మరికొందరు టిఆర్ఎస్, బీజేపీలలో చేరిపోయారు. ఇక తెలంగాణ ఎన్నికలు నాలుగున్నరేళ్ళ కేసీఆర్ పాలనకు రెఫరెండంగా మారనున్నాయి. తెలంగాణ తెచ్చిన పార్టీగా 2014 ఎన్నికల్లో ప్రజలు పట్టం కట్టారు. రేపు ఎన్నికల్లో ఆ ఫీలింగ్ వుండదు. కేవలం ప్రభుత్వ పనితీరు ఆధారంగానే ప్రజాతీర్పు ఉండబోతోంది. ఆంధ్రప్రదేశ్‌లోని చంద్రబాబు ప్రభుత్వంతో పోల్చి చూస్తే కేసీఆర్ ప్రభుత్వమే ఎంతో సమర్ధవంతంగా పనిచేసిందని చెప్పొచ్చు. ఒక్కసారి కూడా కేసీఆర్ సచివాలయానికి పోలేదు. ప్రగతిభవన్ నుండే పరిపాలన సాగించాడన్న అపవాదును పక్కనపెడితే, ప్రజాసంక్షేమ పథకాలను అమలు చేయడంలోనూ, సాగునీటి ప్రాజెక్టులు, విద్యుత్ ఉత్పత్తి వంటి విషయాలలోనూ కేసీఆర్ ప్రభుత్వం ఎంతో బెటర్‌గా వుంది. ముఖ్యంగా చంద్రబాబు ప్రభుత్వంపై వున్నన్ని అవినీతి, అక్రమాల ఆరోపణలు కేసీఆర్ ప్రభుత్వంపై లేవు. ఇచ్చిన హామీలను కూడా చాలావరకు నెరవేర్చ గలిగాడు. అయితే కొన్ని వర్గాలలో కొంత అసంతృప్తి వుందన్న మాట వాస్తవమే. ఈ అసంతృప్తి టిఆర్ఎస్‌ను ఓడించేంత బలంగా వుందా? అన్నదే ప్రశ్న!

టీఆర్ఎస్‌కు అన్ని జిల్లాలలోనూ బలముంది. బలమైన నాయకత్వముంది. అయితే రాజధాని హైదరాబాద్‌లోనే ఆ పార్టీ కేడర్ ఎంత పటిష్టంగా వుందనేదానిపై అనుమానాలున్నాయి. 2014లోనూ హైదరాబాద్ సిటీలో ఆ పార్టీ జెండా ఎగరలేకపోయింది. గ్రేటర్‌లో సెటిలర్స్ ఎక్కువ. అందులోనూ ఆంధ్రులెక్కువ. కాబట్టి సహజంగానే కాంగ్రెస్, టిడిపి పార్టీలు బలంగా వుండేవి. కాని గ్రేటర్ హైదరాబాద్ ఎలక్షన్‌లలో పరిస్థితి పూర్తిగా మారడం చూసాం. సెటిలర్లు సైతం ఆ ఎన్నికల్లో టిఆర్ఎస్‌కే జై కొట్టారు. కాబట్టే 99 సీట్లతో టిఆర్ఎస్ సొంతంగా మేయర్ సీటును కైవసం చేసుకోగలిగింది. గ్రేటర్ ఎన్నికల్లో మారిన వాతావరణం రేపటి ఎన్నికల్లో కూడా అలాగే వుంటే ఇక టిఆర్ఎస్‌కు తిరుగుండదు. హైదరాబాద్ సిటీలో కనీసం 10సీట్లు సాధిస్తే 60 మెజార్టీ మార్క్‌ను దాటడం టిఆర్ఎస్‌కు పెద్ద సమస్య కాదు. తెలంగాణ ఎన్నికల ఫలితాల ప్రభావం తదుపరి వచ్చే ఆంధ్రా ఎన్నికలపై తప్పక వుంటుంది. తెలంగాణలో కూటమి గెలిస్తే ఆంధ్రాలోనూ చంద్రబాబు కాంగ్రెస్‌తో కలిసే ముందుకుపోతాడు. తెలంగాణలో టిఆర్ఎస్ గెలిచిందో... చంద్రబాబు కాంగ్రెస్ చేతిని అప్పుడే వదిలేస్తాడు. జరగబోయేది ఇదే!

---

### శ్రీశ్రీ రచనలు..

## స్ఫూర్తిదాయక బాటలు

### - దర్శక నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ



సత్కారాన్నందుకుంటున్న సుద్దాల అశోక్‌తేజ

మహాకవి శ్రీశ్రీ రచనలు నేటి యువతరానికి ఎంతో స్ఫూర్తిదాయకమైనవని, ఆయన రచనలు నేటి సమాజాన్ని ఎంతగానో ప్రభావితం చేస్తున్నాయని ప్రముఖ దర్శక నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ అన్నారు. ఈనెల 17న నెల్లూరులోని శ్రీశ్రీ చారిటీస్ ప్రజాభ్యుదయ దివ్యాంగుల చైతన్యవేదిక నిర్వహించిన కార్యక్రమానికి ప్రముఖ సినీకవి సుద్దాల అశోక్‌తేజతో కలసి ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం ఆయన సమాజాన్ని చైతన్యవంతం చేసి ముందుకు నడిపించాలనే స్ఫూర్తితో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న శ్రీశ్రీ ఛారిటీస్‌ను అభినందించారు. నేటి దివ్యాంగుల పాటల కార్యక్రమాన్ని చూడగలగడం తన అదృష్టమన్నారు. కష్టపడే మనస్తత్వం, సాధించాలనే పట్టుదల ఉంటే దేనినైనా సాధించవచ్చున్నారు. సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ మాట్లాడుతూ శ్రీశ్రీ సాహితీ రంగాన్ని ముందుకు నడిపించిన మహాకవి అని కొనియాడారు. తాను మొదట ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నా, సినీ పాటలపై ఆసక్తితో నిరంతర శ్రమతో ఈ స్థాయికి వచ్చానన్నారు. అమ్మ గురించి రాసిన ‘అమ్మా నీ కలలే నా కంటిపాపలైనాయి’ అనే పాట తనకెంతో పేరుతెచ్చిందని, నాన్న గురించి కూడా ఓ పాట రాయాలని నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ కోరగా ‘నాన్నా నీ గుండెలపై నడక నేర్చుకున్నానని’ అంటూ రాసిన గీతం కూడా సుప్రసిద్ధమైందన్నారు. ఈ సందర్భంగా సినీజర్నలిస్టు ప్రభు దంపతులను, యువదర్శకుడు నాగు గవరలను నిర్వాహకులు సత్కరించారు. సంఘమిత్ర స్కూల్ అధినేత రవీంద్రరెడ్డి, మైథిలి మనోహర్‌రెడ్డి, ఎం.వి.సుబ్బారెడ్డి, ఆచార్య ఆదిత్య, ఎపియుడబ్ల్యుజె నాయకుడు జయప్రకాష్ పాల్గొన్నారు.

---




## ప్రజల ముందు వాస్తవాలుంచాలి

నెల్లూరులో ఎంతో చారిత్రాత్మక మహిళా విద్యాసంస్థ కస్తూరిదేవి విద్యాలయం. ఎందరో మహనీయుల కృషి ఫలితం. ఇలాంటి విద్యాసంస్థను వివాదాల్లోకి లాగడం, పత్రికలలోకి ఎక్కించడం మంచి పద్ధతి కాదు. 4దశాబ్దాల క్రితమే ఈ స్కూలుకు చెందిన కొంత భూమిని కొందరు స్వార్ధపరులు లీజుల పేరుతో తీసేసుకున్నారు. జె.వి.రెడ్డి చాలాకాలం నుండి సంస్థ ఆస్తులను కాపాడుకుంటూ వస్తున్నారు. కస్తూరిదేవి విద్యాలయ కమిటీ సారధులుగా వున్న జి.వి.కె.రెడ్డికి గాని, జె.వి.రెడ్డికి గాని పరాయి ఆస్తులను కబ్జా చేసిన చరిత్ర లేదు. ముఖ్యంగా జి.వి.కె.రెడ్డి కోట్ల రూపాయలు తన సొంత ధనాన్నే సేవా కార్యక్రమాలకు ఖర్చు చేస్తున్నారు. అలాంటి వారి చేతుల్లో కస్తూరిదేవి విద్యాలయాలు ఉండడం మంచిది. వీళ్ళను వెళ్ళగొట్టి కస్తూరిదేవి భూములను హస్తగతం చేసుకోవడానికే కొందరు పనిగట్టుకుని ఆయన మీద బురద చల్లడానికి ప్రయత్నిస్తున్నారు. ఇలాంటివారి ప్రయత్నాలను నెల్లూరీయులు అడ్డుకోవాలి. కస్తూరిదేవి ఆస్తులను పరిరక్షించుకోవాలి.

**మెట్ట శ్యాంప్రసాద్, నెల్లూరు.**

## జగన్ పాదయాత్ర దిగ్విజయంగా సాగాలి

ప్రతిపక్ష నాయకులు వై.యస్.జగన్మోహన్‌రెడ్డికి పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు కల్పించాలని కోరుతున్నాము. భారతదేశ చరిత్రలో సుదీర్ఘ పాదయాత్ర చేస్తున్న ప్రజానాయకుడు జగన్ కడప జిల్లా ఇడుపులపాయ నుండి ప్రారంభించి కర్నూలు, అనంతపురం, కడప, చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, కృష్ణ, ఉభయ గోదావరి జిల్లాలు, విశాఖపట్నం, విజయనగరం జిల్లాల్లో జగన్ పాదయాత్ర నిర్వహించారు. పాదయాత్ర ప్రారంభం నుండి ఇప్పటి వరకు ఎక్కడ చూసినా జనం తండోప తండాలుగా వస్తూ, 4సంవత్సరాల తెలుగుదేశ పాలనలో తమకు జరిగిన అన్యాయాన్ని ఆయన దృష్టికి తీసుకొస్తున్నారు. జగన్‌కు లభిస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేని దుష్టశక్తులు ఆయనపై హత్యాయత్నం చేయడం రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం. రాష్ట్రానికి భావి నేత జగనే. జగన్‌పై హత్యాయత్నం జరిగిన తరువాత ముఖ్యమంత్రి, మంత్రులు తమ బాధ్యతను మరచి కేసును తప్పుదోవ పట్టించే విధంగా ప్రకటనలు చేయడం సముచితం కాదు. ప్రజాస్వామ్యంలో ముఖ్యమంత్రికి ఎంతటి ప్రాధాన్యత ఉందో ప్రతిపక్ష నాయకునికి కూడా అంతే ప్రాధాన్యత ఇవ్వాలి. దీనిని పోలీసు అధికారులు గుర్తించాలి.

**యస్.బాబురావు, కావలి.**

## తప్పు చేసినట్లేనా?

ఆంధ్రప్రదేశ్‌లోకి సిబిఐకు అనుమతి నిరాకరిస్తూ చంద్రబాబు ప్రభుత్వం జి.ఓ జారీ చేయడం సమైక్య స్ఫూర్తికే విరుద్ధం. రాష్ట్రంలో దొంగలను కాపాడడం కోసమే చంద్రబాబు ఈ పని చేసినట్లుగా వుంది. తన నాలుగున్నరేళ్ళ పాలనలోని అవినీతి, అక్రమాలపై ఎక్కడ కేంద్రం విచారణకు ఆదేశిస్తుందోనని చంద్రబాబు భయపడినట్లున్నాడు. దీనికితోడు జగన్‌పై హత్యాయత్నం కేసు దర్యాప్తును కూడా సిబిఐకు అప్పగిస్తారేమోనని భయమేసి ఉంటుంది. ఆ కేసు సిబిఐకు ఇస్తే పచ్చనేతల బండారం బయట పడుతుందనే ఆందోళన కూడా చంద్రబాబు చేసిన పనికి ఒక కారణంగా చెప్పొచ్చు. ఏదేమైనా సిబిఐకు అనుమతి నిరాకరించడంతో తన పాలనలో అవినీతి జరుగుతోందని చెప్పకనే చెప్పారు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు.

**పలగాటి సుశీల్, నెల్లూరు.**

## చరిత్ర తెలుపుతున్నారు

గత రెండు వారాలుగా శ్రీ కస్తూరిదేవి విద్యాలయం చరిత్రను “ఇదీ కస్తూరిదేవి కథ”తో ప్రతివారం మాకందిస్తున్నందుకు ధన్యవాదాలు. ఎప్పుడూ నిజాలను సాక్ష్యాలతో ప్రచురించి ప్రజలకు అందించడంలో ముందుంటుంది ‘లాయర్’ పత్రిక. సంస్థపై వస్తున్న అనవసర ఆరోపణలకి, అపోహలకి సమాధానంగా వాస్తవ చరిత్రని అందరికీ అందించి అసలు నిజాలను వెలికి తేవాలని ప్రయత్నించడం గొప్ప విషయం. 90సంవత్సరాల క్రితం జరిగిన విషయాలను కూడా సేకరించి అందిస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది. ‘లాయర్’ ద్వారా ఎన్నో చారిత్రాత్మక విషయాలను తెలుసుకున్నాం. ఇప్పుడు కస్తూరిదేవి అసలు కథ తెలుసుకుంటున్నాం.

**పి.మాధవి, విశాఖపట్నం.**






# 'దేశం' సిటింగ్‌లలో సీటు కలవరం

- నలుగురు ఎమ్మెల్యేలపై తీవ్ర వ్యతిరేకత
- ప్రత్యామ్నాయ అభ్యర్థులకై కసరత్తు

***నెల్లూరుజిల్లాలో తెలుగుదేశం పార్టీకి ముగ్గురు ఎమ్మెల్యేలున్నారు. ఉదయగిరి నుండి బొల్లినేని రామారావు, కోవూరు నుండి పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, వెంకటగిరి నుండి కురుగొండ్ల రామకృష్ణ 2014 ఎన్నికల్లో గెలిచారు. వీరు కాకుండా గూడూరు నుండి వైసిపి ఎమ్మెల్యేగా గెలిచిన పాశం సునీల్‌కుమార్ కూడా ఆ తర్వాత టిడిపిలో చేరాడు. తెలుగుదేశం నుండి జిల్లాలో నలుగురు ఎమ్మెల్యేలుండగా ఒక్కరి మీద కూడా వారి వారి నియోజకవర్గాల్లో ప్రజల్లో సానుకూలత లేదు. ప్రజా వ్యతిరేకత తీవ్ర స్థాయిలో వుంది. తెలుగుదేశం పార్టీయే స్వయంగా ఎమ్మెల్యేల పనితీరుపై నిర్వహించిన సర్వేలో ఈ విషయం వెల్లడైంది.***

చంద్రబాబు సీట్లు ఇచ్చే విషయంలో సర్వేలను, టెక్నాలజీని ఎక్కువుగా నమ్ముతాడు. కాబట్టి సిటింగ్ ఎమ్మెల్యేలైన ఈ నలుగురికీ చంద్రబాబు చూస్తూ చూస్తూ మళ్ళీ సీట్లిస్తాడా? ఒకవేళ వీళ్ళకు సీట్లు ఇవ్వకూడదు అనుకుంటే వారి స్థానాలలో వారికంటే ధీటైన ప్రత్యామ్నాయ అభ్యర్థులున్నారా? ఉదయగిరిలో ఎమ్మెల్యే బొల్లినేని రామారావుపై వ్యతిరేకత వుంది. ఈసారి ఆయనకు సీటు ఇవ్వొద్దని స్థానిక తెలుగుదేశం నాయకులే కొందరు బహిరంగంగా కోరుతున్నారు. మరి రామారావును పక్కన పెట్టాల్సి వస్తే ప్రత్యామ్నాయ అభ్యర్థి ఎవరు? మాజీఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, పారిశ్రామికవేత్త కావ్య కృష్ణారెడ్డి, బిల్డర్ ఎర్రా బ్రహ్మయ్య... ప్రస్తుతానికి వినిపించే పేర్లు. ఎన్నికల నాటికి ఇంకా ఒకరిద్దరి పేర్లు కూడా పరిశీలనలోకి రావచ్చు. బొల్లినేని రామారావు కంటే వీరిలో ఎవరు బెటర్ అని రిపోర్ట్ వచ్చినా బొల్లినేని సీటుకు బొక్క పడ్డట్లే!

కోవూరులో సిటింగ్ ఎమ్మెల్యే పోలంరెడ్డిపై వ్యతిరేకత బాగానే వుంది. పార్టీ సభ్యత్వ నమోదులో కోవూరు బాగా వెనుకబడిందంటూ ఈమధ్య చంద్రబాబు కూడా పోలంరెడ్డి శీనయ్యకు చీవాట్లేశాడు. ఇక్కడ పోలంరెడ్డికి ప్రత్యామ్నాయంగా ఎవరున్నారు. ఒకటి నెల్లూరు పార్లమెంట్‌కు పోకపోతే ఆదాల ప్రభాకర్‌రెడ్డి అసెంబ్లీ నుండి పోటీ చేయాలనుకుంటున్నాడు. ఆయన మొగ్గుచూపుతున్నది కోవూరు అసెంబ్లీపైనే! ఇక రెండో నాయకుడు పెళ్ళకూరు శ్రీనివాసులురెడ్డి. 2014లోనే ఆయన సీటు ఆశించి భంగపడ్డాడు. ఈసారి మాత్రం ఖచ్చితంగా పోటీ చేసి తీరుతానంటున్నాడు. మరి ఆదాల కాకుండా పెళ్ళకూరు కూడా కోవూరుకు ఒక ఆప్షనే!

వెంకటగిరిలో ఎమ్మెల్యే రామకృష్ణపై వ్యతిరేకత వుండడం నిజమే! కాని వెంకటగిరి టిడిపి టిక్కెట్ నాక్కావాలంటూ ఇంతవరకు ఎవరూ తెరమీదకు రాలేదు. కాబట్టి మళ్ళీ అతనికే సీటు ఇవ్వక తప్పని పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

ఇక గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కు మళ్ళీ సీటివ్వాలి. ఎందుకంటే అతను వైసిపి నుండి జంప్ చేసి వచ్చాడు కదా! ఆ మాత్రం నమ్మకం నిలబెట్టుకోవాలి. ఇక్కడ టీడీపీ పోటీ చేయాల్సి వస్తే ఎంత వ్యతిరేకత వున్నా కూడా సీటు సునీల్‌కు ఇవ్వక తప్పదు. అయితే సునీల్‌కు సీటు ఎగ్గొట్టే అవకాశం ఇప్పుడు చంద్రబాబుకు పొత్తు రూపంలో కలిసి రావచ్చు. పొత్తులో భాగంగా ఈ సీటును కాంగ్రెస్‌కు వదిలేస్తే సునీల్‌ను సూక్ష్మంగా తప్పించేయవచ్చు. రేపు జరగబోయేది కూడా ఇదే!

జిల్లాలో టిడిపికి నలుగురు ఎమ్మెల్యేలుంటే ఖచ్చితంగా ఇద్దరికి సీట్లు ఎగరడం ఖాయ మనిపిస్తోంది.!

## రామ్‌తో...
# అద్దంకి వైసిపి నాయకులు

- బాపట్లలో పార్టీ పరిస్థితిపై చర్చలు



ప్రకాశం జిల్లా అద్దంకి నియోజకవర్గానికి చెందిన వైసిపి నాయకులు 19వ తేదీ నెల్లూరులో వైసిపి తిరుపతి, బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గాల ఇన్‌ఛార్జ్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని కలిశారు. అద్దంకి అసెంబ్లీ కూడా బాపట్ల లోక్‌సభ పరిధిలోకి వస్తుంది. ఈ నేపథ్యంలోనే వీరు రామ్‌కుమార్‌రెడ్డిని కలిసి అద్దంకి నియోజకవర్గంలో పార్టీ పటిష్టతకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. త్వరలో బాపట్ల పార్లమెంటు పరిధిలో పర్యటించి పార్టీ నాయకులను, కార్యకర్తలను, సానుభూతిపరులను సమన్వయపరుస్తానని, పార్టీ బలోపేతానికి మీ అందరి సహకారంతో కృషి చేస్తానని ఈ సందర్భంగా రామ్‌కుమార్‌రెడ్డి వారికి వివరించారు. అద్దంకి నుండి వచ్చిన వైసిపి నాయకులు బి.వి.కృష్ణారెడ్డి, నరసింహచౌదరి, వెన్నపూస జోసెఫ్‌రెడ్డి, ఎస్.రామశేఖర్‌రెడ్డి, బి.సుధాకర్‌రెడ్డి, గాలయ్య నాయక్‌లు రామ్‌ను శాలువాతో సత్కరించారు.

## రూరల్‌లో...
# షికార్లు కొడుతున్న పేర్లు









- తెరమీదకు రోజుకో నాయకుడు
- ఇంకా అయోమయంలో కేడర్

***వైసిపి బలంగా వున్న నియోజకవర్గాలలో నెల్లూరురూరల్ ఒకటి అనే ప్రచారం వుంది. కాబట్టి దీనికి తగ్గట్లుగానే తెలుగుదేశం అధిష్టానం కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. నెల్లూరురూరల్ నియోజకవర్గం 2009లో ఏర్పడింది. 2009, 2014 రెండుసార్లు ఎన్నికలు జరిగాయి. తెలుగుదేశం ఒక్కసారి కూడా పోటీ చేయలేదు. పొత్తులో భాగంగా 2009లో సిపిఎంకు, 2014లో బీజేపీకి ఈ సీటు వదిలేసారు. దీంతో ఈ నియోజకవర్గం ఏర్పడ్డాక సైకిల్ ప్రత్యక్ష పోటీలో లేదు. కాబట్టి నియోజకవర్గంలో టిడిపి కేడర్ బలహీనంగా వుంది.***

అయితే ఈసారి ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ నియోజకవర్గంలో తెలుగుదేశం అభ్యర్థి నిలవబోతున్నాడు. అయితే వైసిపి అభ్యర్థి, సిటింగ్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి సరైన ప్రత్యర్థి ఎవరు కాగలరన్నదానిపైనే తెలుగుదేశం నాయకులు తర్జనభర్జన పడుతున్నారు. నెల్లూరురూరల్ ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరిస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డే తొలుత ఇక్కడ పోటీలో వుంటాడని భావించారు. కాని, ఆయన నెల్లూరు లోక్‌సభ కాదంటే కోవూరు అసెంబ్లీ వైపు మొగ్గుచూపుతున్నట్లుగా తెలుస్తోంది. ఆదాల ప్రభాకర్‌రెడ్డి తాను నెల్లూరు లోక్‌సభకు పోటీ చేసేపనైతే నెల్లూరు రూరల్ అభ్యర్థిగా మంత్రులు పి.నారాయణ లేదంటే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిలలో ఒకరిని పోటీ చేయాలని అడుగుతున్నారు. సోమిరెడ్డి సర్వేపల్లిని వదిలి వచ్చే పరిస్థితి లేదు. ఆయన రూరల్‌కు వస్తే సర్వేపల్లిలో కాకాణికి ఎదురుండదు.

పోతే మొన్నటివరకు నెల్లూరు సిటీ సీటుకు వినిపిస్తున్న మంత్రి నారాయణ పేరు కొన్నిరోజులుగా రూరల్‌లోనూ వినిపిస్తోంది. నెల్లూరు నగరం సీటును మైనార్టీలకు ఇచ్చేటట్లయితే రూరల్ నుండి నారాయణను దించే అవకాశాలనూ పరిశీలిస్తున్నారు. వీళ్ళు కాకుండా కోవూరు సీటును ఆశిస్తున్న పెళ్ళకూరు శ్రీనివాసులురెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మెన్ కిలారి వెంకటస్వామినాయుడు, ఆనం జయకుమార్‌రెడ్డిల పేర్లు కూడా ప్రచారంలో వున్నాయి. అయితే కొత్తగా బీద రవిచంద్ర పేరును తెరపైకి తెచ్చి కిలారి సంచలనం రేపాడు.

అంతేకాదు, నెల్లూరురూరల్‌లో పార్టీకి అన్ని విధాలా ఆకర్షణగా నిలిచే కొత్త వ్యక్తులను కూడా సడెన్‌గా తెరమీదకు తెచ్చే దిశగా తెలుగుదేశం నాయకత్వం పావులు కదుపుతున్నట్లు సమాచారం. అయితే చివరకు ఎవరు అభ్యర్థి అవుతారో తెలియక రూరల్ నియోజకవర్గ కేడర్‌లో మాత్రం అయోమయం నెలకొనివుంది!

## వర్గాలుగా వేరై...
# తన్నుకుంటున్న తమ్ముళ్ళు

తెలుగుదేశం పార్టీలో రసవత్తర రాజకీయాలకు, గ్రూపులకు కుమ్ములాటలకు ఉదయగిరి నియోజకవర్గం వేదికగా మారింది. జిల్లాలో ఇంకెక్కడా లేనంతగా తెలుగుదేశం పార్టీలో రచ్చలు, రావిళ్ళు ఇక్కడే చోటుచేసుకుంటున్నాయి.

ఇటీవలకాలం వరకు ఇక్కడ తెలుగుదేశంలో ప్రశాంతంగానే వుంది. ఎమ్మెల్యే బొల్లినేని రామారావు ఏక నాయకత్వమే నడిచింది. ఇక్కడ తెలుగుదేశం పార్టీలో ఏదన్నా ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా వర్గ రాజకీయాలు చేయగల సత్తావున్న నాయకుడు మాజీఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి. కాని ఈ నాలుగున్నరేళ్ళలో ఆయన బొల్లినేని రామారావుకు వ్యతిరేకంగా ఎలాంటి వర్గరాజకీయాలు చేయలేదు. గ్రూపులు కట్టలేదు. వ్యతిరేకులను ఎమ్మెల్యేలపైకి ఉసిగొల్పలేదు. బొల్లినేనికి కంభం విజయరామిరెడ్డి చాలా బాగా సహకరించాడు.

కానీ నియోజకవర్గంలో ద్వితీయశ్రేణి నాయకులే ఇప్పుడు బొల్లినేనిపై కత్తికట్టారు. నియోజకవర్గంలో ఇప్పుడు బొల్లినేని అనుకూలురు, వ్యతిరేకులు అనే రెండు వర్గాలు ఏర్పడ్డాయి. బొల్లినేనికే టిక్కెట్ ఇవ్వాలంటూ కొంతమంది కోరుతుండగా, ఆయనకు మళ్ళీ టిక్కెట్ ఇవ్వొద్దనే వాళ్ళు రోజురోజుకు పెరుగుతున్నారు. ఈమధ్య వరికుంటపాడులో పార్టీ సమావేశంలోనే ఇరు వర్గాల మధ్య గొడవ జరిగింది. తనకు వ్యతిరేకంగా వున్న ఎర్రా బ్రహ్మయ్యను పార్టీ మండల కన్వీనర్ పదవి నుండి తొలగించాడు. తన మనిషి మధును ఆ పదవిలో పెట్టుకున్నాడు. ఇటీవల వరకు ఉదయగిరి సీటు నాదేనంటూ తిరుగుతుండిన సీఎం ప్రోటోకాల్ ఆఫీసర్ అశోక్‌బాబును ఉదయగిరిలో మళ్ళీ అడుగుపెట్టకుండా రామారావు కట్టడి చేసాడని తెలుస్తోంది. అలాగే నిన్నటికి నిన్న వింజమూరు, కొండాపురం జడ్పీటీసీలు కూడా ఎర్రా బ్రహ్మయ్యతో కలిసి బొల్లినేనిపై తిరుగుబాటు జెండా ఎగురవేశారు. మొత్తానికి జిల్లా టిడిపిలో టిక్కెట్ వేడి అంతా కూడా ఉదయగిరిలోనే కనిపిస్తోంది.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

నెల్లూరు కబుర్లు

# ఇదేం పని..?

## నగర ప్రజలకు నరకం చూపారు

ఈ నెల 20వ తేదీ నెల్లూరులో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన నగర ప్రజలకు, ముఖ్యంగా వాహనదారులకు నరకం చూపింది. ధర్మపోరాట దీక్ష సభను జాతీయ రహదారి పక్కన ఎస్‌విజిఎస్ కాలేజీ గ్రౌండ్‌లో పెట్టారు. భద్రతా మరియు ట్రాఫిక్ కారణాల రీత్యా సీఎం సభ జరిగే సమయంలో జాతీయ రహదారి మీద వెళ్లాల్సిన ట్రాఫిక్‌ను నగర పరిధిలోని మినీబైపాస్ మీదుగా మళ్లించారు. దీంతో కోవూరు ఫ్లైఓవర్ దగ్గర నుండి బుజబుజనెల్లూరు వద్ద గల నేషనల్ హైవే ఆఫీసు వరకు కొన్ని వేల వాహనాల రాకపోకలతో మినీబైపాస్ రద్దీగా మారింది. వాహనాలను నియంత్రించలేక పోలీసులు కూడా నానా అవస్థలు పడ్డారు. ఇక వాహనదారుల కష్టాలు సరేసరి.

అసలు సీఎం సభ కోసం జాతీయ రహదారి మీద పూర్తిగా ట్రాఫిక్ ఆపేయాల్సిన అవసరం లేదు. సింహపురి ఆసుపత్రి జంక్షన్ నుండి ఎన్టీఆర్ నగర్ వరకు హైవేపై ఓ వైపు రోడ్డును పూర్తిగా బ్లాక్ చేసేసి ఇంకో వైపు రోడ్డులో ఇరువైపు వాహనాలను అనుమతించి వుంటే ఏ తలనొప్పి వుండేది కాదు.

### పీపుల్స్ పార్కుకు..

## శంకుస్థాపన చేసిన మేయర్



ఈ నెల 18వ తేదీన నెల్లూరు 18వ డివిజన్‌లోని హరనాథపురం ప్రాంతంలో పీపుల్స్ పార్క్ నిర్మాణానికి మేయర్ అబ్దుల్ అజీజ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరులో ప్రతి మున్సిపల్ రిజర్వ్ స్థలాన్ని పార్కుగా మలుస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే 25పార్కులను యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

### వైయస్సార్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా

## రూ.50 వేలు సాయం

నెల్లూరు నగరంలోని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి కార్యాలయంలో ఈనెల 18 న వైయస్సార్ ఇంటర్నేషనల్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు గడ్డం ధనుంజయరెడ్డి, పులిమి సుబ్బారెడ్డి, చింతగుంట సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో గడ్డం వెంకటసుబ్బారెడ్డి ద్వారా సౌత్ మోపూరుకు చెందిన దివంగత భాస్కరాచారి సతీమణి పార్వతీకుమారికి రూ.50 వేలు చెక్కును ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ యూఎస్ లోని అట్లాంటాలో ఉండే వైయస్సార్ ఇంటర్నేషనల్ చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయమన్నారు. గడ్డం సుబ్బారెడ్డి, రామకృష్ణారెడ్డి, పెళ్లకూరు సుధాకర్ రెడ్డి, రంగారెడ్డి, మారంరెడ్డి కుమార్, రవీంద్రరెడ్డి, మోహన్‌రావు, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

### పెద్ద అయ్యవార్ల

## కొత్త కార్యవర్గం

ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా కార్యవర్గాన్ని 18వ తేదీ నెల్లూరులోని వారి కార్యాలయంలో ఎన్నుకున్నారు. జిల్లా గౌరవాధ్యక్షుడిగా ఆర్.రవీంద్రయ్య, అధ్యక్షుడిగా వి.కొండారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఆర్.మురళీధర్, కోశాధికారిగా ఎం.శంకరయ్య, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా వై.చెంచురామయ్య, పి.వి.రమణ, బి.మునిరత్నం, నెల్లూరు డివిజన్ అధ్యక్షుడిగా బుజ్జయ్య, కార్యదర్శిగా వి.అక్కిరెడ్డి, కావలి డివిజన్ అధ్యక్షుడిగా కె.వి.సత్యనారాయణ, కార్యదర్శిగా ఆర్.కనకారావు, ఆత్మకూరు డివిజన్ అధ్యక్షులుగా ఎ.వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా ఒ.వెంకటేశ్వర్లు, గూడూరు డివిజన్ అధ్యక్షులుగా సి.హెచ్.చలపతి, కార్యదర్శిగా ఎస్.కోదండరాం, నాయుడుపేట డివిజన్ అధ్యక్షులుగా కె.దొరస్వామి, కార్యదర్శిగా సి.హెచ్.నరసింహారావులను ఎన్నుకున్నారు.

### చేవూరు ఆధ్వర్యంలో..

## కాంగ్రెస్‌లోకి వైసిపి కార్యకర్తలు



నెల్లూరు నగరం 48వ డివిజన్‌కు చెందిన వైసిపి కార్యకర్తలు షేక్ అబిద్, షేక్ సందానిలు తమ అనుచరులతో ఈ నెల 18వ తేదీన కాంగ్రెస్‌పార్టీలో చేరారు. కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, నెల్లూరు నగర ఇన్‌ఛార్జ్ చేవూరు దేవకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా చేవూరు దేవకుమార్‌రెడ్డి మాట్లాడుతూ సామాన్యులను సైతం ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు, కేంద్రమంత్రులు, ముఖ్యమంత్రులను చేసిన ఘనత కాంగ్రెస్‌పార్టీదే నన్నారు. కొత్తగా పార్టీలో చేరే ప్రతి ఒక్కరికి కూడా కాంగ్రెస్‌లో గుర్తింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మైనార్టీ నాయకులు ఫరూక్, ఎం.ఎస్.సర్ఫరాజ్, షకీర్, మున్నా, ఇలియాజ్, ఉస్మాన్, అల్తాఫ్, నవీద్, ఉమర్, సాజిద్, అజ్గర్, ఖాదర్, వవీద్, అషన్, మస్తాన్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

## జడ్పీ సమావేశం

డిసెంబర్ 6వ తేదీన ఉదయం 10.30గంటలకు నెల్లూరుజిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జరుగుతుందని జడ్పీ సిఇఓ బాపిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశంలో తాగు, సాగునీటి సమస్య, పారిశుద్ధ్యం, అంటు వ్యాధులు, అభివృద్ధి వంటి అంశాలపై చర్చించనున్నారని, సభ్యులందరూ హాజరు కావాలని ఆయన కోరారు.

### ఆర్యవైశ్య మహాసభలో..

## తిరివీధి స్థానం పదిలం

- మళ్ళీ సహాయ కార్యదర్శిగా నియామకం

రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కమిటీలో నెల్లూరుకు చెందిన ఆర్యవైశ్య నాయకుడు తిరివీధి ప్రకాశరావుకు మంచి స్థానం దక్కింది. హైదరాబాద్‌లోని ఆర్యవైశ్య మహాసభ కార్యాలయంలో ఈనెల 16న జరిగిన కార్యక్రమంలో తిరివీధి ప్రకాశరావును మహాసభ సహాయ కార్యదర్శిగా నియమిస్తూ నిర్ణయం తీసుకున్నారు. మంత్రి సిద్దా రాఘవరావు, రాజ్యసభ సభ్యుడు టిజి వెంకటేష్, మహాసభ అధ్యక్షుడు పెనుగొండ సుబ్బారాయుడు, గౌరవాధ్యక్షుడు జయంతి వెంకటేశ్వర్లు పాల్గొని తిరివీధికి ఆ మేరకు నియామక పత్రాన్ని అందజేశారు. గత కార్యవర్గంలో కూడా తిరివీధి ఇదే పదవిలో మూడేళ్లపాటు కొనసాగిన నేపథ్యంలో, ఈ తాజా నియామకంతో ఆయన స్థానం పదిలంగానే ఉన్నట్లయ్యింది. ఏదేమైనా, రాష్ట్రస్థాయి మహాసభ కార్యవర్గంలో నెల్లూరీయునికి సముచిత గౌరవం దక్కడం మంచిదే కదా!...

## బాబూ... గోబ్యాక్

### నెల్లూరులో బిజెవైఎం నిరసన




ఇంటికో ఉద్యోగం ఇస్తామంటూ అధికారంలోకి వచ్చిన చంద్రబాబు, నిరుద్యోగులను నిలువునా మోసం చేసాడంటూ బిజెవైఎం కార్యకర్తలు 20వతేదీ నిరసన ర్యాలీ చేపట్టారు. అబద్దాల చంద్రబాబు 'గోబ్యాక్' అంటూ నినాదాలు చేస్తూ మినీబైపాస్‌లోని బీజేపీ కార్యాలయం నుండి ర్యాలీగా చంద్రబాబు పర్యటనను అడ్డుకోవడానికి బయలుదేరారు. అయితే ఆనం వెంకటరెడ్డి బొమ్మ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. ఇక్కడ పోలీసులకు, బిజెవైఎం కార్యకర్తలకు మధ్య కొద్దిసేపు వాగ్వాదం, తోపులాట జరిగింది. అనంతరం పోలీసులు ఆందోళనకారులను అరెస్ట్ చేసి టి.పి.గూడూరు పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు.

ఈ కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు ఉదయ్‌కుమార్, సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, ఫణిరాజు, సుమన్, ప్రజాపతి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్పీని కలిసిన హిజ్రాలు

నెల్లూరులోని హిజ్రాలు ఇటీవల జిల్లా ఎస్పీ ఐశ్వర్యరస్తోగిని ఆయన ఛాంబర్‌లో కలిసారు. ఆయనకు అభినందనలు తెలిపి తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్ళారు. హిజ్రాల సంఘం జిల్లా అధ్యక్షురాలు అలేఖ్య వీరందరినీ తోడ్కొని ఎస్పీ వద్దకు వెళ్ళారు.

## కార్పొరేటర్‌లకు కొమ్ములుండవు

ఈనెల 17వ తేదీన నెల్లూరులోని హరిత టూరిజం హోటల్‌లో 9వ డివిజన్ కార్పొరేటర్ దామవరపు రాజశేఖర్ అతిప్రవర్తన ఆయన పార్టీకే చెడ్డపేరు తెస్తోంది. హోటల్‌లో రూమును అద్దెకు తీసుకున్నారు. గదిలో ఇద్దరు, ముగ్గురుంటే సరే... 8మంది ఉండొద్దని చెప్పినందుకు రిసెప్షనిస్ట్ మీద దాడి చేసి కొట్టడమెందుకు? వాళ్ళు ఉద్యోగులు, గదిలో 8మంది ఉంటే మీరేం గాడిదలు కాస్తున్నారా అని పైఅధికారులు వాళ్ళనే మందలిస్తారు. అటు ఇటు మధ్యలో నలిగేది ఈ సన్న, చిన్న జీతగాళ్ళే! కార్పొరేటర్‌లు అవుతానే కొమ్ములేమీ రావు, మనమూ మనుషులమే, మనుషులుగా ప్రవర్తించడం నేర్చుకోవాలి. నలుగురిని కొట్టడం నాయకత్వ లక్షణం కాదు, పదిమంది మెచ్చుకునేలా ఎదిగేవాడే నాయకుడు.

### డైట్ ప్రిన్సిపాల్‌గా..

## వెంకటేశ్వర్లే

పల్లిపాడులోని డైట్ కళాశాల ప్రిన్సిపాల్‌గా వెంకటేశ్వర్లును నియమిస్తూ ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి నుండి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈమధ్య దాకా డైట్ ప్రిన్సిపాల్ విషయమై జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు, ప్రిన్సిపాల్‌గా వచ్చిన మువ్వా రామలింగంల మధ్య వివాదం నడవడం తెలిసిందే! ఎట్టకేలకు మువ్వా రామలింగంను డైట్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా పనిచేయకుండా సాగనంపాడు కలెక్టర్. గతంలో రామలింగం బదులు వెంకటేశ్వర్లును డైట్ ప్రిన్సిపాల్‌గా కలెక్టరే పెట్టాడు. అయితే మధ్యలో రామలింగం వచ్చి ఆయనతో పేచీ పడ్డాడు. ఇప్పుడు రామలింగం పోడు పోయింది. వెంకటేశ్వర్లుకు ప్రిన్సిపాల్‌గా అధికారికంగా ఉత్తర్వులు అందాయి.

## ఈ ధగధగలెందుకు?

దండగమారి పనులకు కోట్ల రూపాయలను తగలెయ్యడంలో ఎవరైనా చంద్రబాబుకు కిందే! ప్రజలకు నయాపైసా ఉపయోగంలేని పనులకు వందలు, వేల కోట్లు దుబారా చేయడం చూస్తున్నాం. ఈమధ్య పండుగలకు నగరాలు, పట్టణాలలో ప్రభుత్వం తరఫునే ధగధగమనే లైటింగ్ వేయిస్తున్నారు. మొన్న దసరాకు 9రోజులు, దీపావళికి మూడురోజులు నగరమంతా జిగేల్ జిగేల్‌మనే కలర్‌ఫుల్ లైట్లు వెలిగించారు. తాజాగా చంద్రబాబు పర్యటన సందర్భంగా 19, 20తేదీలలో కూడా నగరంలోని మెయిన్‌రోడ్లలో సీరియల్ సెట్లు వేసి ధగధగలాడించారు. కార్పొరేషన్ వాళ్ళు చేయాల్సిన పనులు గాలికి వదిలేసారు. రోడ్లన్నీ దుమ్ము కొట్టుకుపోయి వున్నాయి. గుంతలమయం, నగరంలో దోమలు స్వైరవిహారం, ఫాగింగ్ లేదు, మురికి కాలువల్లో పూడిక తీయడం లేదు. ఈ పనులు వదిలేసి పైపై మెరుగులకు ప్రాధాన్యతనిస్తే ఏం లాభం?

## ఎస్‌బి సి.ఐగా శ్రీనివాసరావు

కృష్ణపట్నం పోర్టు సి.ఐ ఘట్టమనేని శ్రీనివాసరావును నెల్లూరు స్పెషల్ బ్రాంచ్ సి.ఐగా నియమించారు. ఇక్కడ సి.ఐగా వున్న మాణిక్యాలరావును విఆర్‌కు ఆదేశిస్తూ గుంటూరు రేంజ్ ఐ.జి కెవిపి గోపాలరావు ఉత్తర్వులు జారీ చేశారు.

## ఝాన్సీ జయంతి జరిపిన జనసేన

వీరనారీమణి ఝాన్సీ లక్ష్మీభాయి జయంతిని జనసేన పార్టీ మహిళలు 19వ తేదీ నెల్లూరులో నిర్వహించారు. మద్రాసుబస్టాండ్ వద్ద జనసేన మహిళల ర్యాలీని ఆ పార్టీ నాయకులు చెన్నారెడ్డి మనుక్రాంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ ర్యాలీ టౌన్‌హాల్ వరకు సాగింది. అనంతరం టౌన్‌హాల్‌లో ఝాన్సీ జయంతి సభను నిర్వహించారు. జనసేన మహిళా నాయకులు ఝాన్సీ చిత్రపటానికి నివాళులర్పించారు.

## ప్రమోషన్ల సంగతేంటి?

పోలీస్ శాఖలో పాతికేళ్ళుగా పనిచేస్తున్న కానిస్టేబుళ్లకు పదోన్నతులు కల్పించాలని కోరుతూ జిల్లా పోలీస్ సంఘం అధ్యక్షుడు ఎం.ప్రసాదరావు, గౌరవాధ్యక్షుడు గంగాధరం తదితరులు 20వ తేదీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు వినతిపత్రం సమర్పించారు. ధర్మపోరాట దీక్షకు నెల్లూరుకు వచ్చిన చంద్రబాబును పోలీస్‌గ్రౌండ్‌లో వీళ్ళు కలిసి తమ సమస్యలు చెప్పుకున్నారు. పోలీస్ శాఖలో కానిస్టేబుళ్ళకు తప్ప మిగతా అన్ని కేడర్‌లలో పదోన్నతులు వస్తున్నాయని, కానిస్టేబుళ్ళకు కూడా న్యాయం చేయాలని పోలీసు సిబ్బందికి ఇళ్ళ స్థలాలు కూడా మంజూరు చేయాలని వారు కోరారు.

### ఎల్‌ఐసి ఏజెంట్ల

## కొత్త కమిటీ

ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా (ఏఓఐ) ఎల్‌ఐసి బ్రాంచ్-1కి కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కొప్పోలు నాగభూషణం యాదవ్, ఉపాధ్యక్షులుగా కె. వెంకటరావు, భరత్‌కుమార్ జైన్, ప్రధాన కార్యదర్శిగా జి.ధనుంజయ, సహాయ కార్యదర్శిగా సిహెచ్ నరసింహులు, కోశాధికారిగా బి.శేఖర్ ఎన్నికయ్యారు. వీరితోపాటు మరికొందరిని కార్యవర్గసభ్యులుగా ఎన్నుకున్నారు. ఇటీవల నెల్లూరు నగరంలోని దర్గామిట్టలో ఉన్న ఎల్‌ఐసి బ్రాంచ్-1 కార్యాలయంలో జరిగిన ఏజెంట్ల సమావేశంలో ఈ కమిటీ ఎన్నిక జరిగింది. ఎల్‌ఐసి బ్రాంచ్-1 మేనేజర్ అజీమ్, ఏబిఎం జనార్ధన్, నెల్లూరు డివిజన్ ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి నరసింహారావు, ఉపాధ్యక్షులు నరసింహులు, ఎల్‌ఐసి బ్రాంచ్-2 కమిటీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## భూగర్భ డ్రైనేజీ పనులు..

# వచ్చే మార్చికల్లా పూర్తిచేస్తాం

**- మంత్రి నారాయణ**



నెల్లూరులో చేపట్టిన భూగర్భడ్రైనేజీ, మంచినీటి పైపులైన్ల పనులను వచ్చే మార్చి నెలాఖరుకల్లా పూర్తిచేయడం జరుగుతుందని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి డా. పొంగూరు నారాయణ చెప్పారు. ఈనెల 18వ తేదిన స్థానిక రామ్‌జీనగర్‌లో సిసిరోడ్ల పరిశీలన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, రానున్న నూరేళ్ళ జనాభా పెరుగుదలను దృష్టిలో పెట్టుకుని ఈ పనులు చేస్తున్నామని, చేపట్టిన పనులు ఒక వానాకాలం సీజన్ దాకా ఉండాల్సినందువల్ల పనులు కొంత ఆలస్యమయ్యాయని, మూడేళ్ళ కాలవ్యవధిలో రెండేళ్ళలోపలే పనులు పూర్తిచేయడం జరుగుతుందని, అభివృద్ది పనుల వల్ల జరుగుతున్న అసౌకర్యాన్ని ప్రజలు పెద్దమనసుతో అర్థం చేసుకోవాలని అన్నారు. రోడ్ల నిర్మాణంలో నాణ్యత ఉండాలని, నాణ్యత లోపిస్తే కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకుండా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ అబ్దుల్ అజీజ్, నగరపాలక సంస్థ కమిషనర్ అలీంబాషా, డిఇఓ శామ్యూల్, పబ్లిక్‌హెల్త్ ఎస్ఇ రామ్మోహన్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మెన్ చాట్ల నరసింహారావు, కార్పొరేటర్లు రాజానాయుడు, బాలకోటేశ్వరరావు, జానకి తదితరులు పాల్గొన్నారు.

# చెప్పిన టైంకు చేశాం...

## ఆత్మకూరులో ఆదాల



ఇచ్చిన మాట ప్రకారం ఆత్మకూరులో చెప్పిన టైంకు 15కోట్ల రూపాయలతో లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంను ప్రారంభించామని నెల్లూరు పార్లమెంటు టిడిపి ఇన్‌ఛార్జ్ ఆదాల ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. 19వ తేదీన ఆయన జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, మాజీఎమ్మెల్యే బొల్లినేని కృష్ణయ్యలతో కలిసి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆదాల మాట్లాడుతూ ఈ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా రెండువేల ఎకరాలకు నీళ్ళు అందించవచ్చన్నారు. పెన్నా నది దగ్గరగా వుండడం వల్ల లిఫ్ట్ ద్వారా రెండువేల ఎకరాలకు నీళ్లిస్తే, మిగిలిన 3వేల ఎకరాలకు చెరువు ద్వారా నీళ్లందించవచ్చన్నారు. తీవ్ర కరువు, వర్షాభావ పరిస్థితుల్లో కూడా సోమశిలకు 48టిఎంసీల నీళ్ళు తెచ్చుకున్నామంటే అది చంద్రబాబు నాయుడు చలవేనని ఆదాల చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు టి.గిరినాయుడు, రమణారెడ్డి, ఖాజావలి, రాపూరు సుందరరామిరెడ్డి, రమణయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి సిలంబమ్ పోటీల్లో..

# రెయిన్‌బో సత్తా చాటింది




జాతీయస్థాయిలో తమ ప్రతిభను ప్రదర్శించి సత్తా చాటారు రెయిన్‌బో విద్యార్థులు. ఈనెల 17 నుండి 19వ తేదీ వరకు ముంబై నగరంలో జరిగిన 5వ జాతీయస్థాయి సిలంబమ్(భారత ప్రాచీన యుద్ధ క్రీడ) పోటీల్లో అత్యధిక పతకాలు సాధించి పాఠశాల పేరును కీర్తి శిఖరాలకు చేర్చారు. రాష్ట్రం మొత్తం మీద క్రీడాకారులు 24 పతకాలు సాధించగా అందులో రెయిన్ బో విద్యార్థులు 7 పతకాలు సాధించడం గమనార్హం. స్పియర్ స్టిక్‌లో కె.సంజయ్‌కృష్ణ, సిహెచ్ సిరిమల్లి కాంస్య పతకాలను, సింగిల్ స్టిక్‌లో కె.సంజయ్‌కృష్ణ వెండి పతకం, యం.గ్రీష్మ కాంస్య పతకాలను, డబుల్‌స్టిక్‌లో యం.లీలామహాలక్ష్మి, కె.శ్రీహిత కాంస్యపతకాలను, ఫైట్ (పోరాటం)లో టియ జయంత్ కాంస్య పతకాన్ని సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ పద్మా సుబ్రహ్మణ్యం, ప్రిన్సిపల్ రామగిరి విద్యాసాగర్ విజేతలుగా నిలిచిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

# త్యాగాల కొమ్మ... ఇందిరమ్మ!

## కాంగ్రెస్‌లో మిగిలివున్న నేతలందరిని ఒకే చోట చేర్చిన ఇందిరమ్మ శత జయంతి వేడుక

మాజీప్రధాని స్వర్గీయ ఇందిరాగాంధీ శతజయంతి పుణ్యమా అని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీలో మిగిలివున్న నాయకులందరూ ఒక చోట చేరారు. ఒకప్పుడు కాంగ్రెస్ అయితే నాయకులు తుట్టెలు తుట్టెలుగా వుండే వాళ్ళు. ఇప్పుడు రాష్ట్రంలో వున్న నాయకులందరినీ ఒక చోటకు చేర్చినా పట్టుమని గట్టోళ్ళు పది మంది కనపడ్డం లేదు. రాష్ట్ర కాంగ్రెస్ నాయకులందరినీ ఒక చోట చేర్చిన ఇందిరాగాంధీ శత జయంతి ఉత్సవాలు 19వ తేదీ నెల్లూరులోని ఇందిరాభవన్‌లో జరిగాయి. పిసిసి అధ్యక్షులు రఘువీరారెడ్డి, మాజీముఖ్యమంత్రి ఎన్.కిరణ్‌కుమార్‌రెడ్డి, ఏఐసిసి కార్యదర్శులు క్రిస్టఫర్, మెయప్పన్, రాజ్యసభ సభ్యులు కె.వి.పి.రామచంద్రరావు, మాజీ కేంద్రమంత్రి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి, పనబాక లక్ష్మి, మాజీఎంపీ కనుమూరి బాపిరాజు, మాజీమంత్రి శైలజానాథ్ తదితర పెద్ద నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ విగ్రహానికి నాయకులంతా పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇందిరాభవన్‌లో నిర్వహించిన సభలో మాట్లాడిన నాయకులందరు కూడా దేశం కోసం ఇందిరమ్మ కుటుంబసభ్యులు త్యాగాలు చేశారంటూ కన్నీళ్ళు కార్చారు. వాళ్ళ త్యాగాల ఫలితంగా ఈరోజు దేశం బ్రతికి బట్టకడుతుందన్నట్లు మాట్లాడారు.

ఈ సందర్భంగా నాయకులు 101 కిలోల కేక్‌ను కట్ చేశారు. ఇక్కడ ఏర్పాటు చేసిన ఇందిరమ్మ శత జయంతి ఫోటో గ్యాలరీని తిలకించారు. అనంతరం ఇందిరాభవన్ నుండి ఆర్టీసీ వద్దనున్న ఇందిరమ్మ బొమ్మ వరకు నిర్వహించిన 2కె రన్‌లో నాయకులు పాల్గొన్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పనబాక కృష్ణయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చేవూరు దేవకుమార్ రెడ్డి, పి.చెంచలబాబుయాదవ్, ఉడతా వెంకట్రావ్, పత్తి సీతారాంబాబు, టి.బాల సుధాకర్, రఘురామ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



2కె రన్‌లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

## సుమంత్ చొరవతో..

# మార్కెటింగ్ సొసైటీకి లాభాలు

నెల్లూరుజిల్లా కో ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ ఛైర్మెన్ వై.సుమంత్‌రెడ్డి తీసుకున్న చొరవ, విధాన నిర్ణయాలతో సొసైటీకి కోటి రూపాయలకు పైగా ఆదాయం వచ్చిందని జిల్లా సహకార శాఖాధికారి బి.సుధాభారతి చెప్పారు. 18వ తేదీ నెల్లూరు శాంతినగర్‌లోని సొసైటి కార్యాలయంలో జరిగిన సహకార వారోత్సవాలలో ఆమె మాట్లాడుతూ ఈ పాలకవర్గం రాకముందు సొసైటీ నష్టాల్లో వుండేదని, ఛైర్మెన్‌గా సుమంత్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించాక ప్రభుత్వ పథకాలను సహకార సొసైటీల ద్వారా అమలు చేసి ఇటు సొసైటీకి, అటు రైతులకు లాభం చేకూర్చారన్నారు. నెల్లూరులోని కో-ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటి గోడౌన్‌లో విత్తన ఉత్పత్తి కేంద్రం ఏర్పాటుకు అనుమతి సాధించామని ఆమె పేర్కొన్నారు. ఈ సమావేశంలో నెల్లూరు, కావలి డివిజన్ సహకార అధికారులు తిరిపాల్ రెడ్డి, శరభయ్య, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే మేజిస్ట్రేట్ బదిలీ

నెల్లూరు రైల్వే మేజిస్ట్రేట్ కె.మాధవి దేవి నెల్లూరు మొదటి తరగతి నాల్గో అదనపు జ్యూడీషియల్ మేజిస్ట్రేట్‌గా బదిలీ అయ్యారు. కడప జిల్లా పొద్దుటూరులో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జిగా వున్న ఎం.ప్రదీప్‌కుమార్‌ను నెల్లూరు రైల్వే మేజిస్ట్రేట్‌గా నియమించారు.

# ఇళ్ళు కట్టుకునేందుకు జర్నలిస్టులకు అవకాశం

నెల్లూరు జిల్లాలోని అక్రిడిటేషన్ పొందిన జర్నలిస్టులకు హౌసింగ్ స్కీంకు సంబంధించి స్థలం వుండి ఇళ్ళు కట్టుకునేందుకు ఎన్‌టిఆర్ అర్బన్ హౌసింగ్ కింద అవకాశం కల్పించారు. 365, 430, 720చదరపుఅడుగుల లేక టౌన్ పరిధిలో 1200 చదరపు అడుగుల గృహాల మంజూరుకు దరఖాస్తులను నిర్ణీత నమూనాలో రూ.10 స్టాంపు అంటించిన అఫిడవిట్ ను డీపీఆర్ ఒ కార్యాలయంలో అందజేయాలని ఉపసంచాలకులు ఎం. వెంకటేశ్వర్రప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తు ఫారాలు డీపీఆర్ఒ కార్యాలయంలో ఇస్తారని, సదరు దరఖాస్తుతో బాటు ఆధార్ కార్డు, రేషన్‌కార్డు నకలు, ప్రస్తుత అక్రిడేషన్ జెరాక్స్‌తో పాటు గత అక్రిడిటేషన్ల జెరాక్స్‌లను జత చేయాలన్నారు. స్థలం వుండి ఇళ్ళు కట్టుకునేవారు ఇంటి స్థలానికి సంబంధించిన దస్తావేజు జెరాక్స్ కాపీని కూడా జత చేయాలన్నారు.

## ఇన్సూరెన్స్ కార్డులు...

జర్నలిస్టుల ప్రమాద బీమాకు సంబంధించి దరఖాస్తు చేసుకున్న పాత్రికేయులు తమ ప్రమాద బీమా ఇన్సూరెన్స్ కార్డులను ఈనెల 19 నుండి నెల్లూరు డీపీఆర్ఒ కార్యాలయంలో పొందవచ్చని సమాచార పౌరసంబంధాలశాఖ ఉపసంచాలకులు యం.వెంకటేశ్వర్రప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.

# డీఎస్సీలో భలే పోటీ

బియిడి ఉపాధ్యాయులే కాకుండా బీకాం, బీబీఏ తదితర డిగ్రీ కోర్సుల్లో ఉపాధ్యాయ శిక్షణ పొందిన వారికి కూడా డీఎస్సీలో అవకాశం కల్పించడంతో ఎన్నడూ లేని విధంగా డీఎస్సీలో తీవ్రమైన పోటీ నెలకొంది. జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, మునిసిపాలిటీలు, ట్రైబల్ వెల్‌ఫేర్ తదితర పాఠశాలల్లో ఆయా కేటగిరీల వారీగా మొత్తం 207 పోస్టులు ఖాళీగా వున్నాయి. వీటి కోసం మొత్తం 25,813 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. గడువు ఈనెల 18న ముగిసింది. వయోపరిమితి 44 ఏళ్ళకు పెంచడంతో మరో 5 వేల మంది అభ్యర్థులు పెరిగారు. వీరికి విడతల వారీగా డిసెంబర్ 6 నుండి జనవరి 2వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి.




### కార్తీకమాసంలో...
# భక్తులకు వందరెట్ల శుభఫలితాలు

**- 'ఇస్కాన్' అధ్యక్షుడు శ్రీ శుకదేవస్వామి**



వనభోజన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

కార్తీకమాసం ఎంతో పవిత్రమైనది... పుణ్యప్రదమైదని, దైవభక్తితో ఉన్నవారికి ఈ మాసంలో నూరు రెట్లు శుభఫలితాలు కలుగుతాయని ఇస్కాన్ మందిరం అధ్యక్షుడు శ్రీ శుకదేవస్వామి చెప్పారు. కార్తీకమాసాన్ని పురస్కరించుకుని ముత్తుకూరు మండలంలోని కాకుపల్లితోటల్లో ఈనెల 18న వనభోజనాల కార్యక్రమం నిర్వహించారు. ఇస్కాన్ మందిరం నిర్వాహకులు, భక్తులు అంతా కలసి శ్రీకృష్ణ బలరామ సుభద్రాదేవిలకు, శ్రీల ప్రభుపాద స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శుకదేవస్వామి మాట్లాడుతూ, కార్తీకమాసాన్ని ఊర్జామాసం అని కూడా అంటారని, ఈ మాసంలో భక్తులు ఆధ్యాత్మికబలం లేదా శక్తిని బాగా పొందగలుగుతారన్నారు. మానవుడు రోజురోజుకు యాంత్రిక జీవితంలో పడి ఆధ్యాత్మిక జీవనాన్ని నిర్లక్ష్యం చేయడం వల్ల ఎన్నో ఇబ్బందులు, మానసిక వత్తిడులకు గురవుతున్నాడని, ఇలాంటి వనభోజనాల కార్యక్రమాల ద్వారా కాలుష్యవాతావరణం నుంచి ప్రకృతిలోకి వెళ్ళడం వల్ల నూతన ఉత్సాహం కలుగుతుందని, ధర్మబద్ధంగా జీవించడం ద్వారా.. భగవన్నామ స్మరణ ద్వారా అన్ని బాధలను అధిగమించవచ్చని భక్తులకు ఆయన ఉద్బోధించారు.

### నటరాజస్వామికి...
# 'గురుకృప' నృత్య నీరాజనం




నెల్లూరులోని శ్రీ గురుకృప కళాక్షేత్రం చిన్నారులు కార్తీక మాసం సందర్భంగా తిల్లానా అనే నృత్యాంశాలతో నృత్య నీరాజనాన్ని నటరాజస్వామికి అర్పించారు. ఈనెల 18 న నెల్లూరు టౌన్ హాలులో కళాక్షేత్రం అధినేత్రి సురభి గాయత్రి జ్యోతి ప్రజ్వలనంతో ప్రారంభమైన ఈ వేడుకలో నృత్య కళాకారిణులు 12 రకాల తిల్లానాలను ప్రదర్శించి ప్రేక్షకులను సమ్మోహన పరిచారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిధులు మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకనుగుణంగా చిన్నారులకు నృత్యకళలో శిక్షణ ఇస్తూ వారి నాట్య పురోభివృద్ధికి దోహదపడుతున్న సురభి గాయత్రి అభినందనీయురాలని కొనియాడారు. నృత్య విద్యలో ప్రావీణ్యాన్ని సాధించిన పలువురు నృత్యకళాకారిణులు నృత్య రీతులను ప్రదర్శించారు. నాట్య గురువులు పురాణం కల్పన వెంకటేశన్, బాలమ్మల పర్యవేక్షణలో చిన్నారులు నృత్యాలు చేశారు.

ఈ కార్యక్రమంలో సంగీతాభిమానులు, కళాకారులు, కళాపోషకులు, నగర ప్రముఖులు పాల్గొన్నారు.

### శ్రీ త్యాగరాజస్వామి స్మరణోత్సవాలకు..
# నగర సంకీర్తన ప్రారంభమైంది



నెల్లూరునగరంలో ఎంతో సుప్రసిద్ధమైన భిక్షాటనాపూర్వక శ్రీ త్యాగరాజస్వామి స్మరణోత్సవాలకు ఈనెల 18న నగర సంకీర్తన ప్రారంభమైంది. స్మరణోత్సవాల సభ నిర్వాహకుడు యనమండ్ర నాగదేవిప్రసాద్ ఆధ్వర్యంలో నగరంలోని శ్రీ త్యాగరాజస్వామి మందిరంలో పూజలు నిర్వహించిన అనంతరం భక్తిశ్రద్ధలతో నగర సంకీర్తన ప్రారంభించారు. మార్చి నెల 2వ వారం వరకు భిక్షాటన చేస్తూ త్యాగరాజస్వామి సంకీర్తనలను ఆలపిస్తామని, మార్చి 25 నుంచి మే 1వ తేది వరకు నెల్లూరు టౌన్‌హాల్‌లో 54వ భిక్షాటనాపూర్వక శ్రీ త్యాగరాజ స్మరణోత్సవాలు వైభవంగా నిర్వహిస్తామని నాగదేవిప్రసాద్ తెలియజేశారు. సంకీర్తనలు గానం చేస్తున్నవారిలో నాగదేవిప్రసాద్‌తో పాటు ఆర్‌వి మల్లికార్జున, అన్నవరం సత్యనారాయణ, అవధానం రాంప్రసాద్, పామర్థి బలరామ్, సుబ్రహ్మణ్యశాస్త్రి, ఏవి ప్రసాద్, వి.హనుమంతరావు, ప్రసాద్, వైవి ధనుంజయ, జి. రామచంద్రయ్య, టి.రామకృష్ణ తదితరులున్నారు.

## గూడూరు డివిజన్ వార్తలు

### రైల్వే ప్రయాణీకుల
# సమస్యలు పరిష్కరించాలి



డీఆర్ ఎంకు వినతిపత్రం అందజేస్తున్న డీఆర్‌ఎం సీసీ సభ్యుడు మయూరి శ్యాంయాదవ్

గుంతకల్ రైల్వే డివిజన్‌లో జరిగిన రైల్వే డీఆర్‌ఎం సీసీ సమావేశంలో రైల్వేస్టేషన్‌లో నెలకొన్న పలు సమస్యల పరిష్కారం కోసం డీఆర్‌ఎం విజయ్‌ప్రతాప్‌సింగ్‌కు వినతి పత్రాన్ని అందజేసినట్లు డీఆర్‌ఎం సీసీ సభ్యుడు మయూరి శ్యాంయాదవ్ ఈనెల 18 న తెలిపారు. గతంలో కొండగుంట, వెంకటగిరి, వెందోడు రైల్వేస్టేషన్లలోని సమస్యలు తెలిపినపుడు అవి పరిష్కరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఇంకా ఆయా రైల్వేస్టేషన్‌ల పరిధిలో పలు సమస్యలు విన్నవించినట్లు తెలియజేసారు.

# జగన్‌తోనే పేదల సంక్షేమం

**– మేరిగ మురళి**



కరపత్రాలను పంపిణీ చేస్తున్న వైకాపా సమన్వయకర్త మేరిగ మురళీ, మల్లు విజయకుమార్ రెడ్డి

వెందోడు గ్రామంలో వైకాపా గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త మేరిగ మురళి ఆధ్వర్యంలో 'రావాలి జగన్–కావాలి జగన్' కార్యక్రమం ఈనెల 19 న నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీ మాట్లాడుతూ జగన్‌తోనే పేదలకు సంక్షేమం సాధ్యమని అన్నాడు. అనంతరం గ్రామంలో పార్టీ కరపత్రాలను ఆయన ఇంటింటికి వెళ్ళి అందరికీ అందజేశారు. ఈ కార్యక్రమంలో వైకాపా మండల అధ్యక్షుడు మల్లు విజయకుమార్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



గూడూరు ఆర్ అండ్ బి అతిథిగృహంలో ఈనెల 19న నిర్వహించిన గ్రీవెన్స్ డేలో ప్రజలు తెలిపిన సమస్యలు, అర్జీలను స్వీకరించి, ఆయా శాఖల అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని చెప్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్



ఇటీవల విజయనగరం జిల్లా కురుపాం నియోజకవర్గం తోటపల్లి వద్ద పాదయాత్ర నిర్వహిస్తున్న వైకాపా అధినేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డిని కలిసి గూడూరు నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిని వివరిస్తున్న వైకాపా రాష్ట్ర కార్యదర్శి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, ఆయన సోదరుడు పేర్నాటి రామలింగారెడ్డి

# నేరాలు జరక్కుండా గట్టి చర్యలు

**-------------- డీఎస్పీ రాంబాబు**



ఆటో డ్రైవర్లకు గుర్తింపు కార్డులు ఇస్తున్న డీఎస్పీ రాంబాబు

గూడూరు డివిజన్ లో అన్ని ప్రధాన పట్టణాలు, గ్రామాలలో నేరాల నియంత్రణకు నిఘా పెంచి, గస్తీ పెంచుతున్నట్లు డీఎస్పీ రాంబాబు తెలిపారు. అన్ని పట్టణాలలో సీసీ కెమెరాలను అమర్చడం వల్ల రాత్రి వేళల్లో అపరచితులు, దొంగల సమాచారం తెలుసుకునే వీలు కలుగుతుందన్నారు. రాత్రి వేళల్లో ఆటోలు నడిపే వారికి పోలీసుల ఆధ్వర్యంలో గుర్తింపుకార్డులు జారీ చేస్తున్నట్లు తెలిపారు. పట్టణంలో రైల్వే జంక్షన్, చిల్లకూరు జాతీయ రహదారి, ఆర్టీసీ బస్టాండ్ తదితర ప్రాంతాల్లో తిరిగే ప్రయాణీకులు ఆటోలో పోలీసులు ఇచ్చిన కార్డులను పరిశీలించి రాకపోకలు సాగించాలని సూచించారు. అనుమతులు లేని ఆటోలు తిరిగితే సీజ్ చేస్తామని హెచ్చరించారు. రాత్రివేళల్లో తిరిగే ఆటోలు పోలీస్‌స్టేషన్ నుంచి అనుమతి పొందాలన్నారు.




బాలల దినోత్సవం సందర్భంగా ఇటీవల వియస్ఆర్ పాఠశాలలో నిర్వహించిన పోటీలలో విజేతగా నిలిచిన ఆ స్కూలు 8వ తరగతి విద్యార్థిని ముప్పాళ శ్రీలేఖకు బహుమతినందజేస్తున్న కళాశాల డైరెక్టర్ నందిమండలం బాలకృష్ణంరాజు, కరస్పాండెంట్ నందిమండలం అన్నపూర్ణమ్మ, ప్రిన్సిపాల్ రాంప్రసాద్, శాంతకుమార్.

# అమరావతిలో ఐక్యరాజ్యసమితి!

గల్పిక

పాతిక ప్రపంచ మేటి నగరాల డిజైన్లను కాసి వడపోసి తీస్తే వచ్చినట్లుండే అమరావతి సిటీ. ఉండవల్లిలోని హైటెక్ రత్న, సీఎం చంద్రబాబు నివాసం. చంద్రబాబు తన గదిలో కూర్చుని... దేశంలో నేను కలవాల్సిన పార్టీల నాయకులు ఇంకా ఎవరన్నా మిగిలి వున్నారా అని ఆలోచించుకుంటున్నాడు. ఎస్పీ, బిఎస్పీ, ఎన్‌సిపి, కాంగ్రెస్, ఆప్, జెడిఎస్, ఎన్‌సి, తృణమూల్... ఇంకా ఎవరన్నా మిగిలివున్నారా? అని ఆయన ఆలోచిస్తుండగా భువనేశ్వరీదేవి, లోకేష్, దేవాన్ష్, బ్రాహ్మిణిలు అక్కడకు వచ్చారు. చంద్రబాబు వారిని చూసి... కూకట్‌పల్లిలో సుహాసిని ప్రచారం కోసం బయల్దేరారా అని అడిగాడు. వెంటనే భువనేశ్వరి.. ఎప్పుడు చూసినా మీకు ఆ రాజకీయాల పిచ్చేనా... కాస్తన్నా ఎంటర్‌టైన్‌మెంట్ అవసరం లేదా... రండి ఈరోజు సన్‌డే, ఆ హోం థియేటర్‌లో కూర్చుని ఏదన్నా సినిమా చూద్దాం అని అంది. సరే పదండి నాకూ కాస్త రిలీఫ్‌గా వుంటుందంటూ చంద్రబాబు కూడా లేచాడు. అంతలో అక్కడకు మంత్రులు జవహర్, పితాని సత్యనారాయణ, పి.నారాయణ, నిమ్మకాయల చినరాజప్ప, కె.ఇ.కృష్ణమూర్తి, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, యనమల రామకృష్ణుడు, జలీల్‌ఖాన్‌లు వచ్చారు. చంద్రబాబు వారితో... రండి సమయానికి వచ్చారు. హోం థియేటర్‌లో కూర్చుని సినిమా చూద్దామని అన్నాడు. వెంటనే మంత్రి జవహర్... సార్, టిక్కెట్లు బుక్ చేసారా, నన్నేమన్నా తీసుకురమ్మంటారా అని అడిగాడు. అది విని చంద్రబాబు తల బాదుకుని అక్కడ టిక్కెట్స్ అవసరముండవులే... రా... అని చెప్పాడు. వెంటనే సోమిరెడ్డి... సార్, నాకు ఇంట్రవెల్‌లో మాత్రం పాప్‌కార్న్, పఫ్ కావాలి అని అడిగాడు. పాప్‌కార్న్ ఏంటి... చికెన్ బిరియానినే తీసిస్తాలేరా... అంటూ హోం థియేటర్‌లోకి తీసుకెళ్ళాడు. అందరు కూర్చున్నాక రామ్ హీరోగా నటించిన 'రెడీ' సినిమా పెట్టారు. సినిమా సాగిపోతోంది. అందరూ ఆసక్తిగా చూస్తున్నారు. ఇంట్రవెల్ తర్వాత బ్రహ్మానందం వస్తాడు. మెక్‌డోవెల్ మూర్తి అతని పేరు. విలన్‌లు కోట శ్రీనివాసరావు, జయప్రకాశ్‌రెడ్డిలకు కంబైన్డ్ ఆడిటర్. మూర్తి వద్ద హీరో రామ్ అసిస్టెంట్‌గా చేరుతాడు. ఇక్కడే రామ్ తన కుటుంబసభ్యులను చికాగో సుబ్బారావు, డల్లాస్ రామారావుల పేర్లతో ప్రవేశపెడతాడు. వారి పేర్లను బ్రహ్మానందం చేతే చెప్పిస్తాడు. బ్రహ్మానందం ఉత్తుత్తిగా చెప్పిన పేర్లు క్యారక్టర్ల రూపంలో వస్తుంటాయి. అప్పుడు బ్రహ్మానందం ఆశ్చర్యంగా... అదేంట్రా నేను సృష్టించిన క్యారెక్టర్‌లు ఇలా వరుసబెట్టి వస్తున్నాయని అంటాడు. అప్పుడు రామ్ అతనితో... మీరే ఒక బ్రహ్మ... మీరనుకుంటే ఒక కొత్త ప్రపంచాన్నే సృష్టించగలరు అంటాడు. స్క్రీన్‌పై ఆ డైలాగ్ వచ్చిన సమయంలోనే నిమ్మకాయల చినరాజప్ప, జవహర్, నక్కా ఆనందబాబు, పి.నారాయణలు చంద్రబాబు వైపు చూశారు. ఏం అలా చూస్తున్నారని వారిని చంద్రబాబు అడిగాడు. అప్పుడు జవహర్... మీలోనూ మాకు ఒక అపర బ్రహ్మ కనిపిస్తున్నాడు సార్ అని అన్నాడు. ఏదో మీ అభిమానంగాని నాకు అంత టాలెంట్ వుందంటారా అని చంద్రబాబు మొహమాటంగా అన్నాడు. ఉందా... టాలెంట్ మీలో వుందా... కిలోల లెక్కన కాదు సార్, టన్నులు టన్నుల లెక్కన మీలో వుంది. మీరనుకుంటే కొత్త ప్రపంచాన్ని కాదు, సరికొత్త విశ్వాన్నే సృష్టించగలరని సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నాడు. అప్పుడు చిక్కిందే సందనుకుని లోకేష్ ఎత్తుకున్నాడు. ముందు సినిమాను ఆపేయించాడు. తర్వాత తండ్రితో... అవును నాన్నారు... సృష్టికి ప్రతిసృష్టి చేయగల టాలెంట్ మీకే వుంది. ఈ విషయం నేను బయట చెపుతుంటే ఎవరూ నమ్మడం లేదు, ఒక్కసారి ప్రయత్నించి చూడండి నాన్నారు అని బ్రతిమలాడుకున్నాడు. అప్పుడు చంద్రబాబు... ఓకే ఓకే... ముందు విశ్వం, ప్రపంచం సృష్టించడం మాటేమోగాని, ఒక దేశాన్ని సృష్టిద్దామన్నాడు. దానికి లోకేష్... ఆల్‌రెడీ తాత గారు తెలుగుదేశంను సృష్టించారు కదా! అని ప్రశ్నించాడు. నేను చెప్పేది పార్టీ పేరు గురించి కాదు... మన రాష్ట్రం పేరు గురించి... మన పార్టీ పేరునే రాష్ట్రానికి పెడితే ఎలా వుంటుందంటావ్ అని కె.ఇ.కృష్ణమూర్తిని అడిగాడు. అందుకాయన... భేషుగ్గా వుంటుంది. జగన్, పవన్‌లతో సహా అప్పుడందరూ తెలుగుదేశంలోనే వున్నట్లవుతుంది అని చెప్పాడు. చంద్రబాబు వారితో... ఇక నుండి మనకు మనమే రాజులం, మన దేశం స్వతంత్రదేశం, మన దేశంలోకి సిబిఐ ప్రవేశానికి అనుమతి లేదంటూ వెంటనే జి.ఓ తయారు చేయండి అని హోంమంత్రి నిమ్మకాయల చినరాజప్పను ఆదేశించాడు. ఇక మనకు సిబిఐ తలనొప్పి వుండదు. స్కాంలు, అవినీతి, అక్రమాలు చేసినవాళ్ళు ఇక్కడ భయపడాల్సిన పనిలేదు. వాళ్ళకు ఈ రాజ్యం సంపూర్ణ రక్షణ కల్పిస్తుంది. కేంద్ర ఎన్నికల సంఘంతో కూడా మనకు అవసరం లేదు. ఈ దేశంలో మన ఎన్నికలను మనమే నిర్వహించుకుంటాం, ఓట్లు కూడా మనమే లెక్క పెట్టుకుందాం... ఆఖరకు విజేతలను కూడా మనమే నిర్ణయిస్తాం అని చెప్పగా... అప్పుడే అక్కడకు వచ్చిన చిత్తూరు ఎంపి వరప్రసాద్ అంతా విని... సార్, ఇన్ని ప్రత్యేకంగా పెట్టుకుంటున్నప్పుడు ప్రత్యేకంగా మన దేశానికి రాష్ట్రపతిని కూడా పెట్టుకుంటాం కదా... దళితుడిగా తొలి రాష్ట్రపతిని నన్నే చేయాలని అడిగాడు. అంతలో జలీల్‌ఖాన్ లేచి... అదేం కుదరదు, రాష్ట్రపతిగా ముస్లింలకే తొలి అవకాశమివ్వాలి, అదీగాక ఈ దేశంలో బి.కాంలో ఫిజిక్స్ చదివిన ఏకైక వ్యక్తిని నేనే కాబట్టి నాకే రాష్ట్రపతి పదవి ఇవ్వాలన్నాడు. అప్పుడు యనమల రామకృష్ణుడు జోక్యం చేసుకుని... అసలు తెలుగుదేశం పార్టీని మోసిందే బీసీలు... నేను గతంలోనే స్పీకర్‌గా చేసున్నాను... కాబట్టి అటు బి.సిగా ఇటు సీనియర్‌గా తొలి రాష్ట్రపతి ఛాన్స్ తనకే కావాలని యనమల అడిగాడు. అప్పుడు చంద్రబాబు... పదవుల సంగతి తర్వాత... ముందు జరగాల్సింది చూడండి. మనమే సుప్రీం కోర్టును పెట్టుకుంటాం, తెలుగుదేశం పార్టీ జెండానే మన జాతీయ జెండా అవుతుంది. మన పార్టీ కార్యకర్తలనే మన దేశ సైనికులుగా పెట్టుకుంటాం. ప్రతి జిల్లా కేంద్రంలో అంతర్జాతీయ విమానాశ్రయాలను ఏర్పాటు చేసి సింగపూర్‌కు డైలీ సర్వీసులు నడుపుదాం... వచ్చే ఒలింపిక్స్‌ను అమరావతిలో నిర్వహించి భారతదేశాన్నే మించిపోయేలా మన తెలుగుదేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడుపుతామని అన్నాడు. అప్పుడు లోకేష్... ఇవన్నీ ఓకే డాడీ... అమరావతిలో ఒక ఐక్యరాజ్యసమితి భవనాన్నే నిర్మిద్దాం. ఇండియాలో బీజేపీకి వ్యతిరేకంగా కూటమి ఏర్పాటు చేసినట్లే ఐక్యరాజ్యసమితిలో మన ఆధిపత్యం వుండేలా అమెరికాకు వ్యతిరేకంగా మిగిలిన అన్ని దేశాలతో ఓ కూటమి కడదాం... అప్పుడు మీరు ఈ దేశానికి కాదు... ఈ ప్రపంచానికే నాయకుడవుతారు అని చెప్పాడు. లోకేష్ చెప్పిన లాజిక్ విని అక్కడున్న వాళ్లందరు కూడా... చంద్రబాబుకు తగ్గ కొడుకు పుట్టాడని మెచ్చుకోలుగా చూశారు.

# కమ్ముకొచ్చిన కరువు



- ఎండిపోయిన చెరువులు..అడుగంటిన భూగర్భజలాలు
- అన్నదాతల దుస్థితిని పట్టించుకోని ప్రభుత్వం

**జిల్లాలో కరువు మేఘాలు కమ్ముకుంటున్నాయి. వర్షాలు కురవక సాగునీరు లేక పంటల పరిస్థితి అయోమయంలో పడింది. రబీ సాగు ప్రశ్నార్థకంగా మారింది. దీంతో రైతులు దిగులుపడిపోతున్నారు. మబ్బులు కూడా రైతుల్ని ఉళకాడిస్తున్నాయే తప్ప కరుణించడం లేదు. ప్రతిరోజూ నల్లగా.. దట్టంగా కనిపిస్తాయి కానీ వాటినుంచి మాత్రం నీటి చుక్కలు రాలడం లేదు. వర్షాలు లేకపోవడంతో బోర్లు, బావులు అన్నీ ఎండిపోయి భూగర్భజలాలు కూడా అడుగంటిపోయాయి. ఇక పంటలు ఎలా పండాలి?.. జీవితాలు ఎలా గడవాలి?.. అనుకుంటూ రైతులు రోజురోజుకీ డీలాపడిపోతున్నారు.**

జిల్లాలో ఈ రబీ సీజన్‌లో కనీసం 5 లక్షల ఎకరాలకు పైగానే రైతులు సాగుచేయాల్సి ఉండగా, సాగునీటి కొరతతో ఆ మేరకు సేద్యం జరుగుతుందో లేదో తెలియడం లేదు. ఇప్పటికి ఉన్న నీరు రెండు లక్షల ఎకరాలకు కూడా సరిపోయే పరిస్థితి లేదని అధికారులే చెప్తున్నారు. సోమశిల ప్రాజెక్టు నుంచి మూడన్నర లక్షల ఎకరాలకు సాగునీటిని అందిస్తామని పాలకులు ధీమాగా చెప్తున్నా ఆచరణలో అది వీలయ్యేట్లు కనిపించడం లేదు. నవంబర్ నెల చివరికి వచ్చినా.. ఆశించిన మంచి వానలు కురవకపోవడంతో సేద్యం పనులు మొదలుపెట్టాలనుకున్న రైతులంతా ఆకాశం వైపు దీనంగా చూస్తున్నారు. గత ఏడాది ఎలాగో కష్టపడి ఇదే సీజన్‌లో ఒకటిన్నర లక్షల ఎకరాలను రైతులు సాగుచేశారు. కానీ ఈ సారి 5వేల ఎకరాల్లో కూడా సాగుచేసే పరిస్థితి కనిపించడం లేదు. గత ఏడాది ఖరీఫ్ సీజన్‌లోనే సాగునీరు సక్రమంగా లేక క్రాప్‌హాలిడే ప్రకటించారు. ఇప్పుడు రబీలో సాగునీరు ఎక్కడినుంచి వస్తుందో అర్థం కావడం లేదు. ముఖ్యంగా జిల్లాలోని మెట్ట ప్రాంతాలన్నీ అధికశాతం వర్షాధారంగా పంటలు పండించుకుంటున్నాయి. వానలు కురవకపోతే అక్కడ పంటలు ఈసారి కూడా అంతే సంగతులు!

## సాగునీటికీ..తాగునీటికీ కరువే!...

జిల్లాలో కరువు పరిస్థితుల దృష్ట్యా ప్రభుత్వం జిల్లాలోని 46 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి తమ పని అయిపోయిందన్నట్లు చేతులు దులుపుకున్నదే తప్ప రైతులకు ఎలాంటి అండదండలందించడం లేదు. రబీ వ్యవసాయ సీజన్ దాటిపోతుండడంతో ఎలాగైనా సరే పంటలు పండించుకోవాలని, అప్పోసప్పో చేసైనా సేద్యం పనులు చేయాలని అనుకున్నా నిరుపేద రైతులకు సాధ్యం కావడం లేదు. బ్యాంకులు రుణాలు ఇవ్వక తిప్పుకుంటుండడంతో అనేకమంది రైతులు దిగులుతో కుదేలైపోతున్నారు. అటు ప్రభుత్వం కానీ ఇటు జిల్లా అధికారగణం కానీ రైతుల దయనీయస్థితిని నిర్లిప్తంగా చూస్తున్నాయే తప్ప పట్టించుకోవడం లేదు. రైతన్న సంక్షేమమే ధ్యేయం అంటూ నాయకులు గొప్పగా ప్రకటించుకుంటున్నారే తప్ప ఆచరణలో రైతులకు అన్ని పథకాలూ ఆమడ దూరంలోనే ఉంటున్నాయి. అన్నదాతల కష్టాలను వినేవారే లేరు..ఆర్చేవారూ తీర్చేవారూ అసలే లేరు. వర్షాభావంతో పంటలు వేసుకోలేని పేద, మధ్యతరగతి రైతుల బతుకుజీవనం ప్రశ్నార్థకంగా మారినా ప్రభుత్వంలో దయ కలగడం లేదని రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. మరోవైపు జిల్లాలో ఒక్క సాగునీటికే కాక తాగునీటికి కూడా కరువు ఏర్పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. అనేక గ్రామాలు త్రాగునీటి కోసం అల్లాడుతూనే ఉన్నాయి. నాయకుల ఊకదంపుడు ఉపన్యాసాలే తప్ప రైతు కంటనీరు తుడిచేవారెవరూ కనిపించడం లేదు.

## నీళ్ళు లేని చెరువులు..

వర్షాభావంతో జిల్లాలో ఈ ఏడాది కూడా పంట పొలాలు నీరందక పూర్తిగా ఎండిపోయే దుస్థితి ఏర్పడింది. జిల్లాలో 1881 చెరువులు ఉండగా, వాటిలో 95 శాతం పైగా చెరువులు నీళ్ళు లేక ఎండిపోయి బీటలువారాయి. చివరికి అల్పపీడనాల వల్లనో తుఫాన్ల వల్లనో ఏదోవిధంగానైనా వాన కురుస్తుందేమోనని అని రైతులు ఆశపడి ఎదురుచూసినా అవికూడా వచ్చీరానట్లుగానే ఆటాడిస్తున్నాయే తప్ప జోరు వానలు అంతంతమాత్రమే. ఒకవేళ ఎప్పుడైనా ఒకసారి వాన జల్లు కురిసినా ఎండిపోయిన చెరువుల్లో ఆ నీరు ఏమాత్రం నిలవడం లేదు. జిల్లాలోని చెరువులకు పూడిక తీసి ఎంతకాలమైందో ఏలినవారికే తెలియాలి. చెరువుల్లో గుంటలేమైనా ఉంటే వాటిల్లో ఉన్న కొద్దిపాటి బురదనీళ్ళలో గుర్రపుడెక్క మొలిచిపోయి ఉంటుందే తప్ప ఆ నీరు దేనికీ పనికిరావడం లేదు. చెరువులు, కాలువలు అనేక ప్రాంతాల్లో గుర్రపుడెక్క ఆకులతో నిండిపోయి కనిపిస్తున్నాయి.


ఇకనైనా ప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారులు ఈ దుస్థితిని గమనించి రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించేందుకు, అన్నదాతలకు చేయూతనందిస్తూ వారి సమస్యలను పరిష్కరించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలి.

## రాటుదేలిన కేటుగాళ్ళను...
# పోలీసులు పట్టేసారు!


నిందితుల వివరాలను మీడియాకు వెల్లడిస్తున్న జిల్లా ఎస్పీ ఐశ్వర్య రస్తోగి

చైన్ స్నాచింగ్‌లు, ఇళ్ల దోపిడీలు, బ్యాగ్ లిఫ్టింగ్‌ల వంటి నేరాలు చేయ డంలో రాటుదేలిన ఐదుగురు నిందితు లను నెల్లూరు క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుండి 20లక్షల విలువచేసే 90సవర్ల బంగారు ఆభరణాలను, రెండు మోటార్‌బైక్‌లు, 50వేల నగదు, సెల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠా నెల్లూరు, చిత్తూరుజిల్లాల్లో 30కేసులలో చోరీలకు పాల్పడినట్లు గుర్తించారు. ఈ నెల 17వ తేదీన నెల్లూరు పోలీస్‌గ్రౌండ్ లోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ ఐశ్వర్యరస్తోగి దీనికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. బోగోలు మం డలం కప్పరాళ్ళతిప్పకు చెందిన తుపాకుల అనూష్‌కుమార్, బాణాల చిన్న, తుపాకుల సునీల్, మేకల రాజా, మేకల ప్రేమ్ కుమార్‌లు ఒక ముఠాగా ఏర్పడ్డారు. నెల్లూరుజిల్లాలోనే కాకుండా తమ దోపిడీ సామ్రాజ్యాన్ని మహారాష్ట్ర తమిళనాడు, కర్నాటక, తెలంగాణాలకు కూడా విస్తరిం చారు. ఈ రాష్ట్రాల్లో మార్చి మార్చి దోపిడీలకు పాల్పడేవాళ్ళు. మహారాష్ట్ర, తెలంగాణాలలోనూ, నెల్లూరులోనూ గతంలో పోలీసులకు చిక్కడం, జైలుకు పోవడం కూడా జరిగింది. అయినా నేరాలు ఆపలేదు వీళ్ళు. ఇటీవల కర్నాటక నుండి వచ్చి నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లో చైన్‌స్నాచింగ్‌లు, బ్యాగ్ లిఫ్టింగ్‌లు ఎక్కు వుగా చేశారు. నెల్లూరు క్రైమ్ డిఎస్పీ బాలసుందరరావు, సిఐ బాజీజాన్‌సైదా, బాలాజీనగర్ సి.ఐ వేణుగోపాల్‌రెడ్డి, క్రైం ఎస్.ఐలు ఎస్.కె.షరీఫ్, కె.మురళీ ప్రసాద్‌లు వీరిపై ప్రత్యేక నిఘా వుంచి వీరిని చాకచక్యంగా పట్టుకున్నారు. వీరిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి రివార్డు లను అందజేశారు.

## వింజమూరు
# దాహం తీరనుందా?



వింజమూరు... మెట్ట ప్రాంతంలో వున్న కరువు మండలం. వర్షం పడితే తప్పితే తాగునీళ్ళకు, సాగునీళ్ళకు దిక్కుం డదు. ఏ రిజర్వాయర్ లేదు. ఏ డ్యామ్ నీళ్ళు కూడా ఇక్కడకు రావు. పది కిలో మీటర్ల దూరంలో సోమశిల నుండి ఉత్తరకాలువ పోతున్నా కూడా అక్కడ నుండి ఇక్కడకు నీళ్ళు తెచ్చుకోలేని దుస్థితి. బావులు, బోర్లు, చెరువులు మీద ఆధార పడే వ్యవసాయం చెయ్యాలి. ఒక్కో సంవ త్సరం అసలు వానలే పడవు. అప్పుడు సాగునీళ్ళకే కాదు, తాగునీళ్ళకు కూడా కరువే! గత రెండేళ్ళుగా వరుసగా ఈ మండలంలో వర్షాలు లేవు. ఈ ఏడాది కూడా చినుకు లేదు. బావులు, బోర్లు పూర్తిగా ఎండిపోయాయి. సాగునీళ్ల సంగతి ఎలా వున్నా, తాగునీళ్ళకు దిక్కు లేకుండా పోయింది. వింజమూరు పట్టణంతో పాటు పరిసర గ్రామాలలో ట్యాంకర్ల ద్వారా మంచినీళ్ళను సరఫరా చేస్తున్నారు. ఈ నెలలో కూడా వర్షాలు కురవకపోతే తాగు నీళ్ళకు తీవ్ర ఇబ్బందులు ఎదురుకా నున్నాయి.

కాగా, జిల్లా మంత్రుల చొరవతో వింజమూరుకు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు మంజూరు కావడం ఒక ఊరటేనను కోవాలి. వింజమూరులోని పాతూరు చెరువులో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. రాజ వోలు వద్ద ఉత్తర కెనాల్ నుండి పైప్‌లైన్ ద్వారా ఈ సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుకు నీటిని సరఫరా చేస్తారు. ఈ సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిజంగా అందుబాటులోకి వస్తే వింజమూరువాసుల తాగునీటి కష్టాలు చాలా వరకు తీరినట్లే!

# డ్రామా దీక్షలాపండి
**- జనసేన నేత మనుక్రాంత్**



కోట్ల రూపాయల ప్రజా ధనాన్ని వృధా చేస్తున్న డ్రామా దీక్షలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెంటనే నిలిపివేయాలని జనసేన జిల్లా నాయకులు చెన్నారెడ్డి మను క్రాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. 20వ తేదీ నెల్లూరులోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు చేస్తున్న డ్రామా దీక్షల వల్ల రాష్ట్ర ప్రజలకు ఎటువంటి ప్రయోజనం లేదన్నారు. బీజేపీతో వున్నన్నినాళ్ళు నవనిర్మాణ దీక్షలని చెప్పి కోట్ల రూపాయలు ప్రజాధనం ఖర్చుపెట్టి, కాంగ్రెస్‌ను తిట్టావు. ఇప్పుడు అదే కాంగ్రెస్ పార్టీతో కలిసి ధర్మపోరాటదీక్షలంటూ కోట్ల రూపాయలు దుర్విని యోగం చేస్తున్నావు. ఏసిల మధ్య కూర్చుని చేసేవాటిని దీక్షలంటారా? మీ 40ఏళ్ళ రాజకీయ అనుభవం ఇదేనా? ఈ దీక్షలకు ప్రభుత్వ అధికారులను మీ ఇంటి గుమస్తాల్లాగా వాడుకుంటున్నారు. మీకు దమ్ము ధైర్యం వుంటే ఇక్కడ కాదు, ఢిల్లీ వెళ్లి ప్రధాని కార్యాలయం ముందు దీక్ష చేయండి... అంతేగాని మీ రాజకీయ లబ్ధి కోసం దీక్షల పేరుతో నాటకాలాడొద్దు, మీ వేషాలన్నీ ప్రజలు చూస్తున్నారు. కొద్దిరోజులు ప్యాకేజీ మేలంటారు, ఇప్పుడు హోదా అంటారు... మీ డ్రామాలన్నింటిని ప్రజలు గమనిస్తున్నారు. 2019 ఎన్నికల్లో మీ రాజకీయ చరిత్రకు ప్రజలే సమాప్తం కార్డు వేయనున్నారని మనుక్రాంత్‌రెడ్డి పేర్కొన్నాడు.

## జగనన్నతోనే..
# విద్యార్థుల జీవితాల్లో వెలుగులు



జగనన్న ముఖ్యమంత్రి అయితేనే విద్యార్థులకు ఫీజు రీ ఎంబర్స్‌మెంట్ అందుతుందని, ప్రతి పేదవాడి చదువుకు అయ్యే ఖర్చును పూర్తిగా భరిస్తామని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అన్నారు. ఈనెల 21 న నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 2వ డివిజన్ విద్యార్థులతో ఆయన తన కార్యాలయంలో మాటామంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తర్వాత చదువుల కోసం ఇళ్ళు, పొలాలు అమ్ముకోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. జగనన్న ముఖ్యమంత్రి అయితే ప్రతి విద్యార్థికి వసతి, భోజనం కోసం అదనంగా సంవత్సరానికి మరో 20 వేల రూపాయలు ప్రతి విద్యార్థికి ఇస్తామన్నారు.

## అడవిలో శివుడికి..
# విశేష అభిషేకాలు
## వైభవంగా వృషభ అర్చన



అడవిలో వెలసిన పర మేశ్వరుని శివలింగానికి కార్తీక మాసం సందర్భంగా ఈనెల 8వ తేదీ నుంచి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, అర్చనలు, అభిషేకాలు ఆలయ అర్చకులు సుబ్రహ్మణ్యస్వామి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహిస్తున్నారు. నెల్లూరు జిల్లా వెంకటా చలం మండలం ఆర్టీసీ ట్రైనింగ్ కాలేజీకి ఎదురుగా శ్రీశ్రీశ్రీ దుర్గాభవాని సమేత అభయ లింగేశ్వరస్వామి వారి దేవ స్థానంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా ఈనెల 22న శ్రీ స్వామి, అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు కనులవిందుగా జరిగాయి.. వృషభాన్ని మేళతాళాలతో, మంగళ వాయిద్యాలతో ఊరేగింపుగా దేవస్థానానికి తీసుకువచ్చి పూజలుచేసి వృషభ అర్చన నిర్వహించారు. 501 ఆవు పాల కలశాలతో నందీశ్వరునికి ప్రాకా రోత్సవం, సాయంత్రం అఖండ జ్యోతి దర్శనం నేత్రపర్వంగా జరిగాయి. కుండ పోతగా వర్షం కురుస్తున్నా భక్తులు విశేషంగా పాల్గొని కార్తీక దీపాలు వెలి గించి పూజలు చేసి నోములు నోచుకు న్నారు. ఆలయ పాలకమండలి సభ్యులు బి.శ్రీనివాసులు, యం.రవికుమార్, కె.ముని శేఖరయ్య, చిరంజీవి, పి. జగదీశ్వరరావు, డిసివి రమణయ్యలు, నాగిరెడ్డి భక్తులకు ఏలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేసారు.

## కాలధర్మం
# వంటేరు వెంకటకృష్ణారెడ్డి



నెల్లూరులోని వర్ధమాన సమాజం అధ్యక్షులు రొటేరియన్ వంటేరు వెంకటకృష్ణారెడ్డి ఈ నెల 20వ తేదీన మరణించారు. ఆయన వయస్సు 89 సంవత్సరాలు. ఆయనకు పిల్లలు లేరు. తెలుగుదేశం నాయకులు ఆనం జయకుమార్‌రెడ్డి సతీమణి శ్రీమతి ఉమామల్లికకి ఆయన మామ అవుతారు.

బోగోలు మండలం బిట్రగుంటకు చెందిన కృష్ణారెడ్డి ఎక్కువ కాలం సామాజిక సేవా కార్యక్రమాలకే పని చేశాడు. రోటరీ క్లబ్ అధ్యక్షులుగాను, చెన్నై క్లబ్ అధ్యక్షునిగాను సేవలందించారు. బిట్రగుంటలో తన తండ్రి వంటేరు చినబాబుల్‌రెడ్డి పేరు మీద స్కూల్‌ను స్థాపించి పేదల విద్యావృద్ధికి చేయూతనిచ్చారు. క్రైస్తవ మతాన్ని స్వీకరించిన ఆయన గిలియన్ సొసైటీని స్థాపించి రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఆ సంస్థ ద్వారా సేవా కార్యక్రమాలు చేపట్టారు. పేదల చదువులు, పెళ్లిళ్లకు ఆర్థిక సాయం అందించే వారు. సువార్త సభల ద్వారా క్రైస్తవ మత ప్రచారం నిర్వహించేవారు. ప్రభువు నందు నిద్రించిన ఆయన ఆత్మకు శాంతిని కోరుతూ... వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

## రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు..
# ఎన్‌బికెఆర్ విద్యార్థులు



ఈ నెల 24, 25 తేదీలలో నెల్లూరులోని ఇన్‌ఫాంట్ జీసెస్ పబ్లిక్ స్కూల్‌లో జరుగనున్న రాష్ట్ర స్థాయి జ్యూడో పురుషుల మరియు మహిళల పోటీలకు కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారు. మహిళల నుండి 60కేజీల విభాగంలో డి.బిందు, పురుషుల నుండి 60కేజీల విభాగంలో వి.సునీల్, 80కేజీల విభాగంలో ఎ.గిరీష్‌లు ఎంపికయ్యారు. ఈ క్రీడాకారులను కళాశాల ఇన్‌ఛార్జ్ డైరెక్టర్ ఎం.వెంకట్రావ్, వ్యాయామ విభాగాధిపతి వి.మల్లికార్జున్‌రెడ్డిలు అభినందించారు.

## రాజ్యసభ సభ్యుడు విపిఆర్ దంపతుల నేతృత్వంలో..

# నేత్రపర్వంగా.. లక్ష దీపోత్సవం



### తరలివచ్చిన భక్తజనసందోహం - దీపకాంతులతో దేదీప్యమానమైన విఆర్‌సి మైదానం

పరమేశ్వరునికి ఎంతో ప్రీతిపాత్రమైన కార్తీకమాసాన్ని పురస్కరించుకుని నెల్లూరు విఆర్‌సి ఉన్నతపాఠశాల మైదానంలో ఈ నెల 16 నుంచి మూడురోజుల పాటు శోభాయమానంగా కార్తీకమాస లక్ష దీపోత్సవం జరిగింది. రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, ఆయన సతీమణి ప్రశాంతిరెడ్డిల సౌజన్యంతో అంగరంగ వైభవంగా ఈ కార్యక్రమం జరిగింది. హరహర శంకర!.. జయజయ శంకర!.. అంటూ భక్తులు పెద్దపెట్టున చేసిన శివ నామస్మరణలతో వేదిక ప్రాంగణం మార్మోగింది. భక్తులు, ప్రముఖులు వెలిగించిన కార్తీక దీపకాంతులతో విఆర్‌సి మైదానం ప్రకాశమానమైంది. ఈ సందర్భంగా వేదిక వద్ద సుమారు 50 అడుగుల శివలింగాన్ని ఏర్పాటు చేశారు. దాని లోపల అమరనాధ మంచులింగం, వీటితో పాటు కేదారేశ్వర స్వామిని ప్రతిష్టించారు. అనంతపద్మనాభుని విగ్రహాన్ని అంతరాలయంలో అద్భుతంగా ఏర్పాటు చేశారు. ఇవన్నీ భక్తులను బాగా ఆకట్టుకున్నాయి. శుక్రవారం ప్రదోషకాలంలో ప్రారంభమైన ఈ వేడుక భక్తులకు నేత్రపర్వమైంది. తొలి రోజు గట్టుపల్లి పవన్‌కుమార్ ఆధ్వర్యంలో గణపతిపూజ, మహన్యాసపూర్వక శత రుద్రాభిషకాలు, గోపూజ, చండీహోమం జరిగాయి. ఈ సందర్భంగా ప్రముఖ



ఆధ్మాత్మిక ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు విచ్చేసి కార్తీక దీపాల విశిష్టతను, కార్తీక మాసం ప్రాధాన్యతను వివరంగా భక్తులకు తెలియజెప్పారు. స్వామి రాధానందభారతి అఖండజ్యోతిని వెలిగించగా వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి దంపతులతో పాటు మాజీ ఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొని చాగంటి కోటేశ్వరరావును ఘనంగా సత్కరించారు. సాయిహేమంత్‌కృష్ణ నాశికా వేణుగానం, వీణ కచ్చేరీ భక్తులను అలరించాయి. భరద్వాజ రుద్రాభిషేకం సంఘం సభ్యులు ఎస్‌విఎస్ రాఘవేంద్రరావు, ధనుంజయ, అర్బన్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కోట సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమ నిర్వాహకులు కంజర్ల భాస్కరశర్మ, మద్దిన విశ్వనాధ్, ఒట్టూరు సంపత్‌రాజు, ఆమంచర్ల వెంకటప్రభాకర్‌రావు తదితరుల పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు జరిగాయి.

### కార్తీక దీపారాధనతో.. పరమాత్ముని అనుగ్రహం...

రెండవ రోజున దేదీప్యమానంగా జరిగిన వేడుకలో పరమహంస పరివ్రాజకాచార్య రాధానందభారతి స్వామి వారు, గన్నవరం భువనేశ్వరి పీఠం ఉత్తరాధిపతి కమలానంద భారతిస్వామివారు పాల్గొని కార్తీకదీపాలు వెలిగించారు. రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి–ప్రశాంతిరెడ్డి దంపతుల సౌజన్యంతో ఈ అద్వితీయమైన కార్యక్రమాన్ని ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి దంపతులు మహాదీప ప్రకాశనం చేశారు. ఈ కార్యక్రమంలో హిందూ దేవాలయ ప్రతిష్టాన పీఠాధిపతి కమలానందభారతి స్వామి మాట్లాడుతూ, హైందవ ధర్మ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని ఉద్బోధించారు. ఉదయం కుంకుమార్చన, చండీయాగం, అష్టదళ పాదపద్మపూజ జరిగాయి. ఈ కార్యక్రమాలకు సంగన గోపాల్‌రెడ్డి, హారిక, సత్యనారాయణ, వరలక్ష్మి, ఖాసా పెంచల వరప్రసాద్‌నాయుడు, పద్మావతి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించగా, వారిని వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి దంపతులు సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆకెళ్ళ విభూషణశర్మ ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. హరిహరాదులను స్మరించుకుంటూ చేసే దీపారాధనతో పరమాత్ముడి అనుగ్రహం పొందవచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వేలాదిమంది భక్తులు పాల్గొని కార్తీక దీపాలు వెలిగించారు.

### కన్నులపండువగా శివపార్వతుల కల్యాణం..

మూడవరోజు కార్యక్రమంలో భాగంగా తొలుత శివపార్వతుల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. నేత్రపర్వంగా జరిగిన ఈ కార్యక్రమానికి కోట సూర్యనారాయణ–లక్ష్మీకుమారి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. అనంతరం 501 మంది దంపతులతో సత్యనారాయణస్వామి వ్రతం జరిగింది. అల్లూరు మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి–శివప్రియ దంపతులు ఉభయ కర్తలుగా అష్టదళ పాదపద్మపూజ జరిగింది. విరూపాక్ష పీఠాధిపతి గంభీరానందభారతిస్వామి పాల్గొని సూర్యభగవానుని వైభవం..కార్తీక దీపం విశిష్టతపై ఆధ్యాత్మికోపన్యాసం చేశారు. ప్రముఖ దాత, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి సతీమణి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పాల్గొని అఖండజ్యోతి వెలిగించారు. ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, నెల్లూరు నగర ఎమ్మెల్యే డాక్టర్ పి.అనిల్‌కుమార్‌యాదవ్, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కార్పొరేటర్ రంగమయూర్‌రెడ్డి, లక్ష దీపోత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భక్తులందరికీ అన్నప్రసాద వితరణ చేశారు.

# సభగా మారిన దీక్ష

(మొదటి పేజీ తరువాయి)



అలా చంద్రబాబు మార్చిన వాటిలో ఒకటే దీక్ష. మహాత్మాగాంధీని మొదలుకొని మొన్నటి అన్నాహజారే వరకు ఈ దేశంలో ఎందరో మహానుభావులు చేసిన దీక్షలు చూసాం. ఎంతో నిరాడంబరంగా, పూర్తి నిరాహారంగా కొన్ని గంటలు కాదు, కొన్ని రోజులపాటు వారి దీక్షలు జరిగేవి. కాని మొన్న నవనిర్మాణ దీక్షల పేరుతో ఇప్పుడు ధర్మపోరాట దీక్షల పేరుతో చంద్రబాబు చేస్తున్న దీక్షలను చూస్తున్నాం. చుట్టూ ఏ.సిలు, భారీ ఏర్పాట్లు, బస్సులు పెట్టి, డబ్బులు ఇచ్చి జనసమీకరణ... ఊకదంపుడు ఉపన్యాసాలు... ఆఖరకు దీక్షలు సభలుగా మారిపోయాయి. మొన్న 20వ తేదీ నెల్లూరులో నిర్వహించిన ధర్మపోరాట దీక్ష చివరకు ధర్మపోరాట సభగా మారడం చూశాం. ఇలాంటి దీక్షలు చేయడం అంటే చిత్తశుద్ధి లేని శివ పూజలు చేసినట్లే!

### బాబు కళ్ళలో ఆనందం చూశారు

ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వం నిధులివ్వకుండా అన్యాయం చేస్తుందంటూ చంద్రబాబు ఊరూరా ధర్మపోరాట దీక్షలు చేస్తున్నాడు. వీటి కోసం కోట్లు ఖర్చు చేస్తున్నారు. 20వ తేదీ కూడా నెల్లూరులో అలాంటి ధర్మపోరాటం సభే పెట్టారు. తెలుగుదేశం–దళిత తేజం నిర్వహించిన శ్రీ వేణుగోపాలస్వామి కాలేజీ మైదానంలోనే దీనిని కూడా పెట్టడం జరిగింది. దీనికోసం వారం నుండి జిల్లా తెలుగుదేశం నాయకులందరు కూడా కష్టపడ్డారు. చంద్రబాబు అంటే పిచ్చి అభిమానులు, పార్టీ నాయకులు తప్పితే స్వచ్ఛంధంగా జనం రారు. అందుకే నెల్లూరు, ప్రకాశం, చిత్తూరు, కడప జిల్లాలలో దగ్గరిదగ్గరి డిపోల నుండి 280 బస్సుల దాకా తెప్పించారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు బస్సులను కేటాయించారు. జన సమీకరణను మండలస్థాయి నాయకులకు అప్పగించారు. ఎవరి తంటాలు వాళ్ళు పడి జనసమీకరణ చేశారు. 20వ తేదీ సభా ప్రాంగణానికి చంద్రబాబు వచ్చే సమయానికి సభలోని కుర్చీలను జనాలతో భర్తీ చేశారు.

మధ్యాహ్నం 2గంటలకు వస్తాడనుకున్న చంద్రబాబు గంట ఆలస్యంగా నెల్లూరొచ్చాడు. హెలికాప్టర్‌లో పోలీస్ గ్రౌండ్‌లో దిగిన చంద్రబాబుకు జిల్లా తెలుగుదేశం నాయకులు, ఉన్నతాధికారులు ఘనస్వాగతం పలికారు. అనంతరం చంద్రబాబు ఎస్‌విజిఎస్ కాలేజీ మైదానంలో ఏర్పాటు చేసిన ధర్మపోరాట దీక్ష సభలో పాల్గొన్నారు. ఈ సభలో ఆయన గంటసేపు మాట్లాడారు. జిల్లాకు పాత హామీలే మళ్ళీ రిపీట్ చేశారు. ఇక మోడీని తిట్టడం, తనను పొగుడుకోవడం అన్నది కామన్‌గా జరిగిపోయాయి.

సాధారణంగా ఇంతకుముందు చంద్రబాబు ఏ సభలోనన్నా పాల్గొంటే ఆయన మైకు పట్టుకోగానే వెళ్ళిపోవడానికి జనం లేచేవాళ్ళు. నాయకులు, పోలీసులు బలవంతంగా కూర్చోపెట్టాల్సి వచ్చేది. ఈసారి ముందుగానే చెప్పి తీసుకొచ్చారో ఏమోగాని చంద్రబాబు మాట్లాడిన గంటసేపు కూడా వచ్చిన జనం చాలావరకు ఓపిగ్గా కూర్చున్నారు. తన ప్రసంగం ముగిసే చివరి వరకు కూడా సభలో జనం కనిపించడంతో చంద్రబాబు మురిసిపోయాడు. శెభాష్... సభను విజయవంతం చేశారంటూ జిల్లా నాయకులను మెచ్చుకున్నాడు. ఎప్పుడూ తమపై చిటపటలాడే తమ నాయకుడు, ఇలా అభినందించడంతో నాయకులు ఆనంద భరితులయ్యారు.

ఈ ధర్మపోరాటం కోసం అశోక గజపతిరాజు, మాగంటి బాబు, మురళీ మోహన్, నారా లోకేష్, గంటా శ్రీనివాసరావు, కొనకళ్ళ నారాయణ, శ్రీరాం మాల్యాద్రి, దేవినేని ఉమామహేశ్వరరావు, సిద్ధా రాఘవరావు, అమర్‌నాథ్‌రెడ్డి, బుట్టా రేణుకా వంటి బయట జిల్లాల నాయకులు తరలిరాగా, టిడిపి అధ్యక్షులు బీద రవిచంద్ర నేతృత్వంలో మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పి.నారాయణ, మాజీ మంత్రి ఆదాల ప్రభాకర్‌రెడ్డి తదితరులు ఈ పోరాటదీక్షను విజయవంతం చేసేందుకు తెగకష్టపడ్డారు.




# సెంట్రల్‌కు.. ఛాలెంజ్

(మొదటి పేజీ తరువాయి)

చెరువుల నీళ్ళు తాగిస్తున్నారు. ఒక్కొక్కరిని టార్గెట్ చేస్తూ వస్తున్నారు. ఈమధ్య రాష్ట్రంలో తెలుగుదేశం నాయకుల మీద వరుసగా ఐటి దాడులు జరిగాయి. వీరిలో చంద్రబాబు కుడి ఎడమ భుజాల్లాంటి వాళ్ళున్నారు. ఐ.టి దాడులను చంద్రబాబు వ్యతిరేకించాడు. కేంద్రం కక్షపూరిత చర్యలుగా అభివర్ణించాడు. అంటే అక్రమ ఆస్తులు పోగు చేసి, ఆదాయపన్నును ఎగ్గొట్టిన వాళ్ళను కూడా పట్టుకోవద్దనేది ఆయన ఉద్దేశ్యంలాగుంది.

జగన్‌పై హత్యాయత్నం కేసు విచారణను హైకోర్టు ఎక్కడ సిబిఐకు అప్పగిస్తుందోననే భయం ఒకటి చంద్రబాబులో మొదలైంది. రాష్ట్ర పోలీసు పరిధిలోనే ఈ కేసును క్లోజ్ చేయాలనుకున్నారు. అయితే వైసిపి నాయకులు హైకోర్టు తలుపు తట్టడంతో ఈ కేసు మలుపు తిరిగింది. ఈ కేసును సిబిఐకు ఇస్తే నిజాలు వెలుగులోకి వస్తాయనే ఆందోళన వుంది. ఇక బాబు పాలనా వైఫల్యాలు అనేకంగా వున్నాయి. పోలవరం ప్రాజెక్ట్ వ్యయం పెంపుపై విచారణ జరపొచ్చు. అమరావతి భూములపై దర్యాప్తు జరపొచ్చు. ఓటు–నోటు కేసు ఆల్‌రెడీ కోర్టులో వుంది. దీని దర్యాప్తును సిబిఐకి ఇచ్చినా చంద్రబాబుకు సినిమానే! పుష్కరాల నిధుల గోల్‌మాల్, మైనింగ్ మాఫియా, వైసిపి ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారం... సిబిఐ దర్యాప్తు జరపడానికి రాష్ట్రంలో అనేక లొసుగులున్నాయి. ఏ ఒక్కదాని మీద సిబిఐ విచారణ జరిగినా బాబు బండారం బయటపడ్డట్లే! అది ఊహించాడు కాబట్టే సిబిఐకు ఆయన నో ఎంట్రీ బోర్డు పెట్టాడు. అయితే బొక్కలు బయటపడే టైం వస్తే ఎన్ని 'నోఎంట్రీ' బోర్డులు పెట్టినా ఉపయోగం వుండదు. ఓ పక్క సిబిఐపై నిషేధం విధించి మరోపక్క మోడీని ఓడించాలంటూ కూటమి కడుతూ చంద్రబాబు మోడీ, షాలకే సవాల్ విసురుతున్నాడు. మరి వాళ్ళు ఈ ఛాలెంజ్‌ను స్వీకరించి సత్తా చాటుతారో లేక చేతకాని వాళ్ళుగా చంద్రబాబు ముందు దద్దమ్మలుగా మిగులుతారో చూడాలి!?




నగర ప్రజలకు నరకం

## వర్షం వచ్చిందని ఆనందించాలా..?

# రోడ్లపై పోలేక ఏడవాలా?

**నెల్లూరులో వర్షం కురుస్తోంది... రెండు, మూడేళ్ళ తర్వాత అమెరికా నుండి మన కూతురో, కొడుకో వస్తుంటే ఎంత ఆనందంగా వుంటుందో ఒక్కసారిగా వర్షాన్ని చూసిన నెల్లూరు జనానికి కూడా అంతకంటే ఆనందంగా వుంది. ఎందుకంటే వర్షాల కోసం జనం మొహం వాచిపోయి వున్నారు.**

నిన్నటిదాకా నెల్లూరులో చినుకు లేదు? ఎండలు కూడా అట్లా ఇట్లా కాయ లేదు. వేసవి కాలాన్ని తలపించే విధంగానే ఎండలు కాసాయి. ఆఖరకు వర్షాల కోసం తుఫాన్‌లు వచ్చినా బాగుండనుకున్నారు. అయితే తుఫాన్‌లు కూడా నెల్లూరు ముఖం చూడ్డం ఇష్టం లేనట్లుగా తమిళనాడు వైపుకు పారిపోయాయి.

ఏదో ఇప్పుడు బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడనం మూలంగా కొద్దిపాటి వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాలు కూడా లేకపోతే నెల్లూరులో వచ్చే నెల నుండి తాగునీటికి కూడా నానా తంటాలు పడాల్సి వుంటుంది.

అయితే వర్షాలు పడుతున్నాయని ఆనందం ఒక పక్కుంటే, భూగర్భ డ్రైనేజీ పేరుతో నగరంలో తవ్వేసి పెట్టిన రోడ్లు ప్రజల పాలిట నరకకూపంగా మారాయి. భూగర్భ డ్రైనేజీ కోసం నగరంలో రోడ్లన్నింటినీ పగలగొట్టారు. ప్రధానరోడ్లను తిరిగి బాగుచేశారు. జనావాస ప్రాంతాలలోని రోడ్లను అలాగే వదిలేసి వున్నారు. నిన్నటిదాకా రోడ్లు ధుమ్మూధూళితో జనాన్ని అగచాట్లు పెట్టాయి. ఇప్పుడు కురిసిన కొద్దిపాటి వర్షానికే తవ్వేసిన రోడ్ల మూలంగా వీధులన్నీ బురదమయమయ్యాయి. తవ్విన గుంతల్లో నీళ్ళు చేరడంతో ఏది గుంతో, ఏది రోడ్డో తెలియక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇలా గుంతల్లో పడే చాలా మంది గాయాలపాలై ఆసుపత్రులకు వెళ్ళారు. తవ్విన రోడ్లతో ప్రజలకు అసౌకర్యం కలిగిస్తున్న మాట వాస్తవమేనని మున్సిపల్ మంత్రి పి.నారాయణే స్వయంగా చెప్పారు. తవ్విన రోడ్లను వెంటనే బాగు చేసుంటే ఈ వర్షాకాలంలో ఇన్ని అవస్థలు ఉండేవి కాదు కదా!

## పక్క రాష్ట్రాల ఓట్లకు..

# ఆంధ్రా నోట్లు



**రాష్ట్రపతిగా రిటైర్డ్ అయ్యాక అబ్దుల్ కలాం తనకు ఎంతో ఇష్టమైన ప్రొఫెసర్ వృత్తి చేపట్టారు. ఇలా సిన్సియర్ నాయకులెందరో ఉన్నత పదవులు వదిలాక తమకు ఇష్టమైన వృత్తులు చేపట్టి తమలోని విజ్ఞానాన్ని ఎంతోమందికి పంచారు. అలాంటి అవకాశం మన ముఖ్యమంత్రి చంద్రబాబుకు కూడా వుంది. ఆయన ఏరోజైనా రాజకీయాల నుండి తప్పుకోవాల్సి వస్తే శుభ్రంగా రాజకీయ నాయకులను తయారు చేసే డీమ్డ్ యూనివర్శిటీని పెట్టుకోవచ్చు. కొమ్ములు తిరిగిన పక్క రాష్ట్రాల నాయకులకు కూడా రాజకీయ పాఠాలు నేర్పే టాలెంట్ ఆయనది.**

డబ్బుతో సీట్లను కొనడం... డబ్బుతో ఓట్లను కొనడం... ఈ రెండు పద్ధతులను రాష్ట్రంలోని నాయకులకు, రాష్ట్ర ప్రజలకు పరిచయం చేసింది చంద్రబాబే! ఈ టెక్నిక్‌ను ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో వాడుకోమని కాంగ్రెస్ నాయకులకు సూచించడమే కాదు, అందుకు ఆయన ఆర్థిక సహకారం అందిస్తున్నట్లు కూడా వార్తలొస్తున్నాయి. తెలంగాణలో కాంగ్రెస్‌కు ఏపి నుండే డబ్బు వెళుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇక్కడ దోచిన దాంట్లో కొంత కాంగ్రెస్‌కు ముష్టి వేస్తున్నట్లు తెలుస్తోంది. తెలంగాణలో కూటమి అధికారంలోకి రావడం చంద్రబాబుకు అత్యవసరం. అందుకు కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకోవడమే కాదు, ఆర్థిక చేయూత కూడా చంద్రబాబు అందించినట్లు భోగట్టా! ఎందుకంటే తెలంగాణలో కాంగ్రెస్ ఎండిపోయింది. చేతిలో అధికారం లేదు కదా! అదే సమయంలో ఏపిలో తెలుగుదేశం కళకళలాడుతోంది. ఎక్కడచూసినా మేతే కదా! చంద్రబాబు తెలంగాణ కాంగ్రెస్‌కే కాదు, రాజస్థాన్‌లో కాంగ్రెస్ నాయకులకు సైతం ఆర్థిక సహకారం అందించాడని, ఆయన ఆపన్నహస్తం అందుకోవడం కోసమే ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ ఇటీవల స్వయంగా అమరావతికి వచ్చి చంద్రబాబును ప్రసన్నం చేసుకున్నాడని తెలుస్తోంది.

# ఊహాకందని విధంగా అభివృద్ధి

**- మంత్రి సోమిరెడ్డి**



ఊహకే అందని విధంగా నిధులు తెస్తూ సర్వేపల్లి నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి పథంలో నడుపుతున్నానని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చెప్పారు. 21వ తేదీ పొదలకూరు మండలం చిట్టేపల్లిలో 4.60 కోట్లతో చేపట్టనున్న ఎన్టీఆర్ సుజల స్రవంతి మెగా వాటర్‌ప్లాంట్ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఓడినా కూడా సర్వేపల్లి శ్రేయస్సే ప్రాణంగా పని చేస్తున్నానన్నారు. చిట్టేపల్లి వద్ద ప్రధాన ట్యాంకు నిర్మాణం జరుగుతుంది. గంటకు 10వేల లీటర్ల నీటిశుద్ధి జరుగు తుంది. 7ట్యాంకర్ల ద్వారా గ్రామాలకు నీటి సరఫరా చేస్తాం. గ్రామాల్లో 35ట్యాంకులను ఏర్పాటు చేస్తాము. ఏటిఎం కార్డు తరహాలో ప్రత్యేక కార్డు ద్వారా 2రూపాయలకే 20లీటర్ల నీటిని పొందవచ్చు. సంక్రాంతి పండుగకల్లా ఈ మెగా వాటర్ ప్లాంట్‌ను ప్రజలకు అంకితం చేస్తాం. పొదలకూరు పట్టణానికి పదిహేను రోజులకోసారి నీళ్లిచ్చే పరిస్థితి పోయి రెండుమూడు రోజులకే ఓసారి నీళ్లిచ్చే పరిస్థితి తెచ్చాం. ఈ నాలుగేళ్లలో మూడు మైలురాళ్ళు అధిగమించాం. కండలేరు ఎత్తిపోతల పథకం సాకారమైంది. సోమశిల దక్షిణ కాలువ పనులను మంజూరు చేయించాం. దేగపూడి, బండేపల్లి కాలువను సాధించాం. ఎస్సీ సబ్‌ప్లాన్ ద్వారా నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు మరో 15కోట్ల రూపాయలు తేనున్నామని ఆయన పేర్కొన్నారు. ఇక్కడ సర్పంచ్ నుండి ఎంపీ వరకు అన్ని పదవులు గెలిచిన వైసిపి నాయకులు ఈ నియోజకవర్గానికి చేసిందేమీ లేదని ఈ సందర్భంగా ఆయన ఎద్దేవా చేశారు.

ఈ కార్యక్రమంలో సర్వేపల్లి టిడిపి ఇన్‌ఛార్జ్ సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, టిడిపి నాయకులు మోపూరు శ్రీనివాసులురెడ్డి, మాజీ జడ్పీటీసీ అనూరాధ, పి.వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో కార్తీక పౌర్ణమి

ఈ నెల 22వ తేదీ కార్తీక పౌర్ణమి కావడంతో నెల్లూరు జిల్లాలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అధిక సంఖ్యలో మహిళాభక్తులు కార్తీక దీపాలు వెలిగించి నోములు నోచుకున్నారు. నెల్లూరు మూలాపేటలోని శ్రీ మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో కార్తీక దీపోత్సవం కార్యక్రమంలో నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్ పాల్గొన్నారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా వేలాదిమంది మహిళలు ఆలయానికి విచ్చేసి కార్తీకదీపారాధనలు చేశారు. నగరంలోని శివాలయాలతో పాటు జిల్లాలోని శైవ క్షేత్రాలన్నీ కార్తీక దీప కాంతులతో కళకళలాడాయి.









Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com